


ప్రజా చైతన్యమే...

# లక్ష్యం

తెలుగు దినపత్రిక




ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి:1 సంచిక:238 బుధవారం ,22-10-2025 పేజీలు : 8 వెల: 3/-

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## శాంతిభద్రతలు ఉంటేనే

# పెట్టుబడులు సాధ్యం







- పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది
- పోలీసుల గౌరవం పెంచుతాం...వారి కుటుంబాల సంక్షేమం భాద్యత మాదే
- సోషల్ మీడియా నేరాలు పోలీసుశాఖకు ఓ సవాలు
- రాజకీయ ముసుగులో చేసే నేరాలను కట్టడి చేయాలి
- మంగళగిరిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, అక్టోబర్ 21: (లక్ష్యం న్యూస్)**

రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలపై విశ్వాసంతోనే గూగుల్ లాంటి దిగ్గజ ఐటీ సంస్థ ఆంధ్రప్రదేశ్ కు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. వాటిని సంరక్షించటంలో పోలీసు శాఖ కీలకపాత్ర పోషించాలని సూచించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రతా దళాల గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించారు. పోలీసు సంస్మరణ దినం ఫ్లాగ్ ధరించి.. ఫ్లాగ్ ఫండ్ కు విరాళం ఇచ్చారు. పోలీసుల గౌరవం పెంచటంతో పాటు వారి కుటుంబాల సంక్షేమం చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ పోలీస్ అంటే ఓ బ్రాండ్ అని.. దానికి మరింత వన్నె తెచ్చేలా పని చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పోలీసులను ఉద్దేశించి ప్రసంగించిన సీఎం "దేశంలో శాంతిభద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. 1959 అక్టోబర్ 21న చైనాపై వీరోచిత పోరాటంలో సీఆర్పీఎఫ్ కు చెందిన 10 మంది జవాన్లు అమరులయ్యారు. వారిని స్మరించుకుంటూ ప్రతీ ఏటా అక్టోబర్ 21న, పోలీస్ అమర వీరుల దినాన్ని నిర్వహించుకుంటున్నాం. వారి త్యాగాలను, బలి దానాన్ని గుర్తు చేసుకుంటూ స్ఫూర్తి పొందుతున్నాం. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారు. వీరికి నివాళులు అర్పిస్తున్నాను. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్న పోలీసులు అంటే నాకెప్పుడూ గౌరవం. పోలీసులు చేసేది ఉద్యోగం కాదు..నిస్వార్థ సేవ." అని అన్నారు. ఈగల్- శక్తి బృందాలతో ఆదర్శంగా ఏపీ పోలీస్ శాఖ "శాంతిభద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. అప్పుడే సంక్షేమం అందరికీ అందుతుంది. ఉపాధి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అప్పుడే కుటుంబంలో, సమాజంలో సుఖ శాంతులు ఉంటాయి. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. సమాజంలో అలజడి ఉంటే పెట్టుబడులు రావు. అందుకే నేను ఎప్పుడూ లా అండ్ ఆర్డర్ పై ఖచ్చితంగా ఉంటాను. తమ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయనే నమ్మకంతో పరిశ్రమలు, కంపెనీలు వస్తాయి. అదే నమ్మకంతో విశాఖలో గూగుల్ పెట్టుబడులు పెట్టింది. విశాఖలో గూగుల్ పెడుతున్న పెట్టుబడులు దేశంలోనే అతి పెద్ద పెట్టుబడి. 15 బిలియన్ డాలర్లతో ఏఐ డేటా హబ్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుంది. అప్పుడే ఏపీ అన్ని రంగాల్లో ముందుకు వెళు తుంది. ఏపీ పోలీసులు అంటే ఒక బ్రాండ్. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజంను అణిచి వేయడంలో ఏపీ పోలీసులు ఎంతో పేరు తెచ్చుకున్నారు. పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. సిద్ధాంతం పేరుతో, ఆధిపత్యం కోసం, డబ్బుల కోసం నేరాలు చేసే వారు ఉన్నారు. ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట పడాలి. నేరాల తీరు మారుతోంది. క్రిమినల్స్ అప్ డేట్ అవుతున్నారు. వారి ఆట కట్టించాలంటే పోలీసు శాఖ కూడా అప్డేట్ అయి ఉండాలి. అందుకే సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నాం. సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్... ఇలా టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ప్రతీ 50 మీటర్లకి ఒక సీసీ కెమేరా ఏర్పాటు చేస్తున్నాం. ఇది పోలీస్ యంత్రాంగానికి మూడో కన్నులా పనిచేస్తుంది. ఎవరు ఎక్కడ ఏ తప్పు చేసినా రికార్డెడ్‌గా పట్టుకునే వీలు కలుగుతుంది. టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ, అధునాతన పోలీస్ స్టేషన్లు, ఈగల్ , శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. డ్రోన్లతో గంజాయి పంటను గుర్తించి ధ్వంస చేస్తున్నారు. స్మగ్లింగ్‌ను అరికడుతున్నారు. అడవుల్లో డ్రోన్లు ఎగరేసి ఎర్ర చందనం దొంగలను కట్టడి చేస్తున్నారు. ఈ విషయంలో పోలీసు శాఖకు అభినందనలు. డబ్బుల కోసం రౌడీయిజం చేసే ముఠాలుగా మారుతున్న వారిని కట్టడి చేయాలి. తప్పు చేసే వారికి పోలీస్ అంటే భయం ఉండాలి. అప్పుడే నేరాలు తగ్గుతాయి." అని ముఖ్యమంత్రి అన్నారు.

## ప్రతీకారం తీర్చుకున్న భారతదేశం






**(న్యూఢిల్లీ,నుంచి)**

భారత్ .. ఆపరేషన్ సిందూర్ ద్వారా ధర్మాన్ని పాటించడమే కాకుండా ప్రతీకారం సైతం తీర్చుకుందని ప్రధాని మోదీ తెలిపారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ప్రధాని దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నాడు దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని మోదీ లేఖ రాశారు. ఆయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత జరుగుతున్న 2 వ దీపావళి వేడుకలు ఇవి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ధర్మాన్ని నిలబెట్టాలని శ్రీరాముడు మనకు బోధించారని.. అలాగే అన్యాయాన్ని ఎదరించడానికి ధైర్యాన్ని సైతం ఇచ్చారని చెప్పారు. అందుకు ఈ ఏడాది మేలో జరిగిన ఆపరేషన్ సిందూరు ద్వారా ఇది నిరూపితమైందని ప్రధాని మోదీ వివరించారు. అదీకాక ఈ దీపావళి వేళ దేశంలోని మారుమూల జిల్లాల్లో సైతం దీపాలు వెలిగించి పండగ చేసుకున్నారని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం, మావోయిస్టులను దాదాపుగా నిర్మూలించామని.. అందువల్లే ఇది సాధ్యమైందని వివరించారు. చాలా మంది మాజీ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి.. రాజ్యాంగంపై నమ్మకంతో అభివృద్ధికి దోహదపడుతున్నారని చెప్పారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు.

## జపాన్ కొత్త ప్రధానికి

# నరేంద్ర మోదీ శుభాకాంక్షలు

**(న్యూఢిల్లీ,నుంచి)**

జపాన్ దేశ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. దేశానికి మొదటి మహిళా ప్రధానమంత్రిగా సనే తకాయిచి ఎన్నికై చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రక ఘట్టంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సనే తకాయిచితో కలిసి పనిచేసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ మంగళవారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. భారత్, జపాన్ మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, అలాగే ప్రపంచవ్యాప్తంగా శాంతి, సుస్థిరత, శ్రేయస్సును నెలకొల్పడంలో ఇరు దేశాల బంధం అత్యంత కీలకమని ఆయన తన పోస్టులో అభిప్రాయపడ్డారు. "జపాన్‌కు నూతన



ప్రధానిగా ఎన్నికైన మీకు హృదయపూర్వక అభినందనలు సనే తకాయిచి. భారత్-జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నా. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అదేవిధంగా ఈ ప్రాంతానికి వెలుపల శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుల నెలకొనడంలో ఇరుదేశాల బంధం కీలకపాత్ర పోషిస్తుంది" అని ప్రధాని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

## డీఎస్పీపై

## పవన్ కల్యాణ్ సీరియస్..

### - పశ్చిమ గోదావరి ఎస్పీతో చరవణి లో మాట్లాడిన పవన్ కల్యాణ్




**(లక్ష్యం న్యూస్) :**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ వ్యవహారశైలిపై తీవ్రంగా స్పందించారు. డీఎస్పీపై వస్తున్న వివిద ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా ఎస్పీని ఆయన ఆదేశించారు. భీమవరం డీఎస్పీ పరిధిలో పేకాట శిబిరాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, ఆయన నేరుగా సివిల్ వివాదాల్లో తలదూరుస్తున్నారని పవన్ కల్యాణ్ దృష్టికి వివిద ఫిర్యాదులు అందాయి. కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి నేతల పేర్లను వాడుకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పవన్ కల్యాణ్ నేరుగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. తన దృష్టికి వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ, డీఎస్పీ జయసూర్య పనితీరుపై నివేదిక పంపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ స్థాయి అధికారి అసాంఘిక కార్యకలాపాలకు అండగా నిలవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు సివిల్ వివాదాల జోలికి వెళ్లకుండా చూడాలని, ఇలాంటి చర్యలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా చూస్తూ శాంతిభద్రతలను కాపాడాలని దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా, భీమవరం డీఎస్పీపై వచ్చిన ఆరోపణల విషయాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, డీజీపీ దృష్టికి కూడా తీసుకెళ్లాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

## ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన నగరాల

# అభివృద్ధికి సహకరించండి

### - పారమట్టా లార్డ్ మేయర్ మార్టిన్ జైటర్ తో మంత్రి లోకేష్ భేటీ



**ఆస్ట్రేలియా (సిడ్నీ):**

గ్రేటర్ సిడ్నీలో కీలక నగరం పారమట్టా లార్డ్ మేయర్ మార్టిన్ జైటర్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పారమట్టాలో స్థానిక వ్యాపారాలను పెంచడం, పెట్టుబడులను ఆకర్షించి గ్లోబల్ సిటీగా మార్చడంలో జైటర్ కృషిని మంత్రి లోకేష్ ప్రశంసించారు. ప్రజారవాణా, గ్రీన్ స్పేసెస్ ను అభివృద్ధి చేయడంలో చొరవ చూపిన జైటర్, పారమట్టా స్క్వేర్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. గత 20 సంవత్సరాలుగా లోకల్ గవర్నెన్స్, కమ్యూనిటీ డెవలప్ మెంట్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సార్టప్ స్టేట్ గా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం హారిస్ పార్కులో లిటిల్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన రివర్ సైడ్ ఫుడ్ కోర్టును సందర్శించారు.

## పోలీసుల వల్లే ప్రజలు ప్రశాంతం

**అమరావతి, అక్టోబరు 21:(లక్ష్యం న్యూస్)**



పోలీసు శాఖను బలోపేతం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టామని హోంశాఖ మంత్రి స్పష్టం చేశారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో నిర్వహించిన 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆమె ,డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే అందుకు పోలీసుల త్యాగాలే కారణమని కొనియాడారు. విధి నిర్వహణలో వారికి అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని, నేరాల నియంత్రణలో ఏపీ పోలీసులు దేశంలోనే ముందున్నారని ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుంటూ ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనిత ఉద్ఘాటించారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా 'ఈగల్ టీం'ను ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించామని చెప్పారు. నిఘాను మరింత పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె వివరించారు.

## పోలీసు అమరవీరులకు

# సెల్యూట్ చేద్దాం

**తాడేపల్లి:(లక్ష్యం న్యూస్)**

పోలీసు అమరవీరులకు వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళు లర్పించారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి సేవలను వైయస్ జగన్ గుర్తు చేసుకున్నారు. దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగాన్ని స్మరించుకుందామంటూ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. వారి అంకితభావం, ధైర్యానికి అందరమూ సెల్యూట్ చేద్దాం అంటూ ఎక్స్ వేదికగా వైయస్ జగన్ పిలుపునిచ్చారు.

## మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున

## పరిహారం ప్రకటించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, అక్టోబరు 21:(లక్ష్యం న్యూస్)**

అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణా సంచా పేలుడు తయారీ కేంద్రం ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారాన్ని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు సురేశ్ కుమార్, ఆకే రవికృష్ణలు ఈ ఘటనపై విచారణ నివేదికను అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పేలుడు ఘటనపై విచారణ నిర్వహించామని అధికారులు సీఎంకు వివరించారు. బాణా సంచా తయారీ కేంద్రంతో పాటు పేలుడు పదార్థాలను కూడా అక్కడే నిల్వ ఉంచారని అధికారులు తెలిపారు. ఒకే షెడ్డులో ఒకే చోట 14



మంది కార్మికులు వీటిని తయారు చేస్తున్న సమయంలో ఈ పేలుడు జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. బాణా సంచా తయారీలో ఇనుప పరికరాలు వినియోగించటం వల్లే రాపిడికి మంటలు రేగి ఒక్కసారిగా పేలుడు జరిగిందని స్పష్టం చేశారు. ఈ తయారీ కేంద్రంలో ఏమాత్రం నిబంధనలు పాటించలేదని సీఎంకు వివరించారు.

# భూమన కరుణాకర్‌రెడ్డికి నోటీసులు

**తిరుపతి: (లక్ష్యం న్యూస్)**

వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి ఎస్వీ వర్సిటీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఎస్వీ గోశాలలో గోవుల మరణాలపై అసత్య ప్రచారం చేశారంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు విచారణ హాజరుకావాలంటూ భూమనకు నోటీసులు జారీ చేశారు.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
బుధవారం ,22-10-2025

# సంపాదకీయం

## బ్రహ్మోస్...

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత శక్తి ప్రపంచానికి తెలిసింది. ఇదే సమయంలో మిత్రులు ఎవరో.. శత్రువులు ఎవరో భారత్‌కు అర్థమైంది. మన చుట్టూనే శత్రువులు ఉన్నారని గుర్తించిన భారత్.. ఆయుధాల తయారీపై దృష్టి పెట్టింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో సరికొత్త టెక్నాలజీతో ఆయుధాలు రూపొందిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోసించిన బ్రహ్మోస్ క్షిపణిని మరింత శక్తివంతంగా మారుతోంది. శబ్ద వేగాన్ని మించిపోయే బలమైన సూపర్‌సోనిక్ మిసైల్ ఇది. శత్రు శిబిరాలను క్షణాల్లో ధ్వంసం చేసే దీనిది ప్రత్యేకత. ఇప్పుడు భారత రక్షణ శాస్త్రవేత్తలు దాని దూరప్రయాణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే దిశలో ముందుకెళ్తున్నారు.ప్రస్తుతం ఉన్న 450 కిలోమీటర్ల పరిధిని 800 కిలోమీటర్లకు విస్తరించేందుకు పరీక్షలు జరుగుతున్నాయి. కొత్త వేరియంట్‌ను 2027 నాటికి సైనిక వినియోగంలోకి తెచ్చేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. దాదాపు అన్ని హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్లు పూర్తయి, ఇప్పుడు ఎలక్ట్రానిక్ నావిగేషన్ సిస్టమ్ పరీక్షల దశలో ఉంది. ఈ పరీక్షలు విజయవంతమైతే, బ్రహ్మోస్ ప్రపంచంలోని అత్యంత వేగవంతమైన ఎయిర్?టు?సర్ఫేస్ ఆయుధాలలో ఒకటిగా మరింత స్థానం సంపాదిస్తుంది.సముద్ర ఆధారిత బ్రహ్మోస్ వెర్షన్‌తో మొదట ఈ సాంకేతిక రూపాంతరం మొదలుకానుంది. నౌకాదళానికి ఉపయోగించే ఫైర్ కంట్రోల్ సిస్టమ్, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ఆధారంగా రేంజ్ పెంపు సాధ్యమవుతుందని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్మీ వేరియంట్‌ను తరువాత, చివరగా వాయుసేనకు అనువైన మోడల్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఇదే సమయానికి ఆయుధ మోడ్యూల్‌లో పెద్దగా మార్పులు చేయకుండా సామర్థ్యం పెంపు సాధనమే ప్రధాన లక్ష్యంగా ఉంది.ఇక గగనతలంలో భవిష్యత్ యుద్ధానికి సిద్ధమవుతూ, “అస్త్ర” సిరీస్ క్షిపణుల శక్తివృద్ధి వేగంగా సాగుతోంది. అస్త్ర మార్క్?2 పనితీరును 160 నుంచి?280 కిలోమీటర్ల దూరం వరకు విస్తరించనున్నారు. కొత్త రామ్‌జెట్ ఇంజిన్‌తో నిర్మితమవుతున్న అస్త్ర మార్క్?3 350 కిలోమీటర్ల రేంజ్ కలిగి ఉండనుంది. ఈ క్షిపణులు బియాండ్ విజువల్ రేంజ్ యుద్ధ పరిస్థితుల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. భారత వాయుసేన, సుఖోయ్?30 ఎంకేఐ, తేజస్ యుద్ధవిమానాల్లో వీటిని అమర్చే ప్రణాళికలో ఉంది.ఈ కొత్త పరిణామాలతో భారత్‌కి విదేశీ దిగుమతులపై ఆధారపడే అవసరం తగ్గనుంది. రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్‌ల వంటి దేశాల నుంచి బీవీఆర్ ఆయుధాల దిగుమతి తగ్గి, స్వదేశీ అభివృద్ధికి బలం చేకూరుతుంది. దీని వల్ల భారత్ ‘రక్షణాత్మక స్వయం సమృద్ధి‘ దిశగా మరొక అడుగు ముందుకేసినట్లవుతుంది.ఈ మధ్య అమెరికా అండ చూసుకొని పాకిస్తాన్ రెచ్చిపోతుంది. పాకిస్తాన్ దేశంలో విస్తారమైన వనరులను అమెరికా కంపెనీలకు కట్టబెట్టడం ఇటీవల విజయవంతంగా పూర్తయింది. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఇటీవల అమెరికాలో పర్యటించారు. ఆ సమయంలో పాకిస్తాన్ దేశంలో లభ్యమవుతున్న అరుదైన వనరులను తవ్వే బాధ్యత అమెరికా కంపెనీలకు అప్పగిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. అందువల్లే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయనతో లంచ్ చేశారు. శ్వేత సౌధంలో ఏకాంతంగా మాట్లాడారు. ఆ తర్వాత పాకిస్తాన్ దేశాన్ని గొప్పగా కీర్తించారు. అమెరికా కంపెనీలు పాకిస్తాన్ దేశంలో అడుగుపెడితే చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే సామ్రాజ్యవాదానికి అమెరికా బలమైన ఉదాహరణ. అటువంటి అమెరికా పాకిస్తాన్లో అడుగుపెడితే.. ఏ ఒక్క సహజ వనరును కూడా వదిలిపెట్టకుండా తవ్వుకొని తీసుకెళ్తుంది. ఇంత బిచ్చం మొహం మీద వేసినట్టు.. పాకిస్తాన్ చేతిలో చిల్లర వేస్తుంది.అమెరికా కంపెనీలు వస్తుండడం.. ట్రంప్ నుంచి బలమైన వర్తమానం అందడంతో పాకిస్తాన్ ఆనందానికి అవధులు లేవు. అందువల్లే మనతో యుద్ధం చేస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. న్యూక్లియర్ బాంబులు ఉన్నాయని.. తమను రెచ్చగొడితే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని హెచ్చరిస్తోంది. అంతేకాదు సింధు నది మీద భారత్ కడుతున్న ప్రాజెక్టులను నేలమట్టం చేస్తామని వార్నింగులు కూడా ఇస్తోంది.. వీటికి సరైన స్థాయిలోనే భారత్ బదులు చెప్పింది. తిక్క తిక్క వేషాలు వేస్తే తోకలు కత్తరిస్తామని హెచ్చరించి. ఇంకోసారి ఇలాంటి లేకి మాటలు మాట్లాడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని గట్టి స్వరంతోనే కౌంటర్ ఇచ్చింది. అయితే ఇప్పుడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాకిస్తాన్ కు మరోసారి గట్టి హెచ్చరికలు పంపారు. ఈసారి ఏకంగా భస్మీ పటలం చేస్తామని డెడ్లీ వార్నింగ్ ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో రూపొందించిన తొలి విడత బ్రహ్మోస్ మిసైల్స్ ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. “పాకిస్తాన్లోని ప్రతి అంగుళం మా బ్రహ్మోస్ మిసైల్స్ రేంజ్ లోనే ఉంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా బ్రహ్మోస్ రేంజ్ ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఆపరేషన్ సిందూర్ అనేది ట్రైలర్ మాత్రమే. దానిద్వారా మన శత్రువుకు సత్తా ఏమిటో చూపించాం. పాకిస్తాన్ దేశానికి జన్మనివ్వగలిగిన ఇండియా.. అవసరమైతే ఏమైనా చేస్తున్నారని నిరూపించింది. అందువల్లే పాకిస్తాన్ ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉంటే మంచిది. అనవసరంగా మా దేశాన్ని గెలికితే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని” కేంద్ర రక్షణ శాఖ మంత్రి హెచ్చరించారు.కేంద్ర రక్షణ శాఖ మంత్రి చేసిన హెచ్చరికల నేపథ్యంలో పాకిస్తాన్ దేశానికి మరో షాక్ తప్పదా అనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే పాకిస్తాన్ దేశం ఇప్పటికే అంతర్యుద్ధంతో ఇబ్బంది పడుతోంది. ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్ దేశానికి చుక్కలు చూపిస్తోంది. పాకిస్తాన్ సైనికులను దారుణంగా హతమార్చుతోంది. సరిహద్దుల వద్ద ఆఫ్ఘనిస్తాన్ భీకరంగా కాల్పులు జరుపుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో పాకిస్తాన్ దేశం పైకి భారత్ గనుక ఆపరేషన్ సిందూర్ లేదా సర్జికల్ స్ట్రైక్స్ ను చేపడితే పరిస్థితి మరో విధంగా ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ భారత్ లో భాగమయ్యే అవకాశాన్ని కొట్టి పారేయలేమని విశ్లేషకులు పేర్కొంటున్నారు

# శివకేశవులకు ప్రీతికరమైన మాసం కార్తీక మాసం


### -హిందువులందరికీ కార్తికమాస ప్రారంభ శుభాకాంక్షలు



కార్తీక మాసము తెలుగు సంవత్సరంలో ఎనిమిదవ నెల, పౌర్ణమి రోజున కృత్తిక నక్షత్రము (అనగా చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలిసిన రోజు) కావున ఈ నెల కార్తీకము.హిందువులకు ఈ నెల శివుడు మరియు విష్ణువు లిద్దరి పూజ కొరకు చాలా పవిత్రమైనది. ఈ కార్తీకమాసము స్నానములకు మరియు వివిధ వ్రతములకు శుభప్రథమైనది.స్కంద పురాణంలో ఈ విధంగా పేర్కొనబడినది:న కార్తికసమో మాసో న కృతేన సమం యుగమ్,న వేదసదృశం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్.అర్థం: కార్తీకమాసానికి సమానమైన మాసమేదీ లేదు; సత్యయుగంతో సమానమైన యుగమేదీ లేదు; వేదములతో సమానమైన శాస్త్రమేదీ లేదు; గంగానది వంటి ఇతర నదేదీ లేదు.ధార్మిక యోచనలు కలిగిన ప్రజలు ఏకభుక్తము, లేక నిరాహారాది వ్రతాలు చేస్తారు. రాత్రులలో దేవాలయాలందు లేదా తులసి దగ్గర దీపాలు వెలిగిస్తారు. స్వయంగా దీపదానాలు చేయనివారు ఆరిన దీపాలను వెలిగించుట వలన, గాలి మొదలైన వాటి వలన దీపాలు ఆరిపోకుండా చేసి, దీపదాన ఫలితాన్ని పొందవచ్చును.కార్తీక మాసంలో ఉభయ పక్షములందు అనేక వ్రతములు ఉన్నాయి. అయ్యప్ప దీక్ష ఈ నెలలో ప్రారంభమై మకర సంక్రాంతి వరకు కొనసాగుతుంది.చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో, ఆ నక్షత్రం పేరు ఆ మాసానికి వస్తుంది. కృత్తికా నక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై సంచరించుట వలన ఈ మాసానికి కార్తీక మాసమని పేరు. కార్తీక మాసమునకు సమానమైన మాసము, విష్ణుదేవునికంటే సమానమైన దేవుడు, వేదములకు సమానమైన శాస్త్రములు, గంగకంటే పుణ్యప్రథములైన తీర్థములు లేవన్నది పురాణ వచనం. కార్తీక మాసము అత్యంత పవిత్రమైంది. మహిమాన్వితమైంది. శివ కేశవులకి ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో దేశం నలుమూలలా ఉన్న ఆలయాలలో రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు, రుద్ర పూజలు విశేషంగా జరుపుతారు. విశేషార్చనలు జరిపే భక్తులకు సదాశివుడు ప్రసన్నుడై వారి అభీష్టాలను తీరుస్తాడు అందుకే ఆ స్వామికి ‘అశుతోషుడు’ అన్న పేరు వచ్చింది. ‘అభిషేక ప్రియః శివః’ శివునికి అలంకారాలతో రాజోపచారములతో, నైవేద్యములతో పనిలేదు. మనస్సులో భక్తినుంచుకుని శివుడ్ని ధ్యానిస్తూ చేసే అభిషేకంతో శివుడు ప్రీతి చెందుతాడు. శివాభిషేకం అన్ని దోషాలను పోగొట్టి సకల శుభాలను కలగ చేస్తుంది. ఈ మాసంలో శివార్చన చేసినవారికి గ్రహదోషాలు, ఈతిబాధలు ఉండవు. శివునిని శ్రీవృక్ష పత్రములతో (బిల్వదళములు) పూజించిన స్వర్గమున లక్ష సంవత్సరములు జీవించును. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు, ఏకకాలంలో రెండురూపాలని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి, కుడి భాగాన పరమేశ్వర రూపంగా అర్ధ నారీశ్వరునిగా దర్శనమిచ్చే సమయం ఈ ప్రదోషకాలంగా చెప్పబడింది. ప్రదోషకాలంలో శివారాధన, శివదర్శనంచేసుకుంటే శివుని అనుగ్రహానికి పాత్రులగుదురు. శివాలయములో ప్రార్థన, లింగార్చన, బిల్వార్చన వంటి పుణ్య కార్యములు ఆచరించుట ఈ మాసంలో విశేష ఫలాన్ని ప్రసాదిస్తాయి. అష్టోత్తర లింగార్చన, మహా లింగార్చన, సహస్ర లింగార్చన ఉత్తమోత్తమమైన అర్చన. ఈ మాసంలో ఈ అర్చనలు చేస్తే సంవత్సర మొత్తం చేసిన ఫలాన్నిస్తాయి. తులసి దళాలతో శ్రీ మహావిష్ణుని కార్తీకమాసంలో పూజిస్తే ముక్తిదాయకం అని శాస్త్ర వచనం. ఈ మాసంలో విష్ణువు దామోదర నామంతో పిలవబడతాడు. ‘కార్తీక దామోదర ప్రీత్యర్థం’ అని ఈ మాసాన వ్రత దీక్ష ఆచరించాలి. తులసి చెంత హరిపూజ పుణ్యప్రదం. సత్యనారాయణ వ్రతం, విష్ణు సహస్రనామ పారాయణ, రుద్రాభిషేకాలు చేయడం శ్రేష్టం. శివానుగ్రహానికి, విష్ణువు అనుగ్రహానికి ఈ మాసం ఉత్కృష్టమైంది. కార్తిక మాసంలో ఏమంత్ర దీక్ష తీసుకున్నా మంచి ఫలితాలను ఇస్తుందని శాస్త్ర వచనం. ‘కార్తిక పురాణం’ రోజుకో అధ్యాయం పారాయణ చేయడం శుభకరం. ఈ మాసం మొదటినుండి సూర్యోదయానికి పూర్వమే నదీస్నానం అత్యంత ఫలప్రదం. కార్తీక నదీ స్నాన విషయంలో ఆరోగ్య సూత్రం కూడా ఇమిడి ఉంది. నదీ జలాలు కొండలలోను, కోనలలోను, చెట్టు పుట్టలను తాకుతూ ప్రవహిస్తాయి. అలా ప్రవహించడం ద్వారా ఎన్నో వనమూలికల రసం నదీ జలాల్లో కలుస్తుంది. ఈ మాసంలో గృహిణులు, యువతులు వేకువనే స్నానం చేసి తులసి కోట ముందు దీపారాధన చేసి గౌరీదేవిని పూజిస్తే ఈశ్వరానుగ్రహంతో సౌభాగ్యాన్ని, సకల శుభాలను పొందుతారు. మాసమంతా స్నాన విధిని పాటించలేని వారు పుణ్య తిథులలోనైనా స్నానం ఆచరించాలి. కార్తీక మాసం మొదలునుండే ‘ఆకాశదీపం’ ప్రారంభమవుతుంది. ఉభయ సంధ్యలలో గృహమందు, పూజామందిరంలోను, తులసి సన్నిధిలోను, ఆలయమలలో దీపారాధన, ఇహ, పర సౌఖ్యాలను కలగచేస్తుంది. ఈ మాసం దీపారాధనకి ప్రశస్త్యం. దీపదానమందు ఆవునెయ్యి ఉత్తమం. మంచి నూనె మధ్యమము. ఏకాదశి అత్యంత విశేషమైనది. ‘ఉత్థానైకాదశి’ కార్తీక శుద్ధ ద్వాదశి కార్తీక పౌర్ణమి లాంటి దినాలు ప్రశస్తమైనవి.

# నిజాం సర్కార్ కు ఎదురొడ్డి పోరాడిన యోధుడు కొమరం భీమ్

### -నేడు ఆదివాసీ వీరుడు కొమరం భీమ్ జయంతి




జల్, జంగల్, జమీన్ అంటూ నిజాం పాలకులకు ఎదురొడ్డి పోరాటం సాగించిన యోధుడు.. గిరిజన హక్కుల కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు కొమురం భీమ్. ఆదివాసీ ఉద్యమాల్లో చాలా కాలంగా లేవనెత్తిన ప్రసిద్ధ నినాదం జల్ జంగల్ జమీన్ మొట్టమొదట ఈ నినాదం చేసింది కొమరం భీమ్. నిజాంల పాలనలో ఉన్న హైదరాబాద్ రాజ్యానికి చెందిన గోండు తెగకు చెందిన యోధుడు ఆయన. భీమ్ తన తెగ హక్కుల కోసం బ్రిటిష్, నిజాం రాజులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి చివరకు ప్రాణాలర్పించిన అమరవీరుడు. కొమురం భీమ్ హైదరాబాదు విముక్తి కోసం అసఫ్ జహి రాజ వంశానికి వ్యతిరేకంగా పోరాడిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడు. ఈయన ఆదిలాబాద్ అడవులలో, గోండు ఆదివాసుల కుటుంబంలో జన్మించారు. గిరిజన గోండు తెగకు చెందిన కొమరం చిన్నూ-సోంబారు దంపతులకు ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో కొమరం భీమ్ 22 అక్టోబర్ 1901 సంవత్సరంలో జన్మించాడు. పదిహేనేళ్ల వయుసులో అటవీశాఖ సిబ్బంది జరిపిన దాడిలో తండ్రి మరణించగా, కొమరం కుటుంబం కరిమెర ప్రాంతంలోని సర్దాపూర్‌కు వలస వెళ్లింది. కొమరం భీమ్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొరిల్లా శైలిలో పోరాడాడు. అతను అడవిని జీవనోపాధిగా చేసుకొని, అన్ని రకాల నిజాం అధికారాలను (అనగా న్యాయస్థానాలు, చట్టాలు) తోసిపుచ్చాడు. అతను నిజాం నవాబ్ యొక్క సైనికులకు వ్యతిరేకంగా ఆయుధాలు తీసుకున్నాడు. పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా ఉద్యమించి వీరమరణం పొందాడు.భారతదేశంలో ఆదివాసీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు చరిత్రాత్మక మైనవి. ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన కొమురం భీము ‘జల్-జంగిల్-జమీన్’ నినాదానికి ప్రతీకగా నిలిచిపోయాడు. కొండ కోనల్లో, ప్రకృతితో సహ జీవనం సాగించే ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కు సామాజిక న్యాయంలో భాగవుని నిన దిస్తూ, 1928 నుంచి 1940 వరకూ రణభేరి మోగించిన కొమరం భీమ్ నైజాం సర్కార్ గుండెల్లో సింహ స్వప్నంగా మారిన పోరాటయోధుడు.భీం కుటుంబం పదిహేడేళ్ళ వయసులో అటవీశాఖ సిబ్బంది జరిపిన దాడిలో తండ్రి మరణించగా కరిమెర ప్రాంతంలోని సర్దాపూర్ కు వలస వెళ్లింది. అక్కడ వాళ్ళు సాగుచేసుకుంటున్న భూమిని సిద్ధిఖీ అన్న జమీందారు ఆక్రమించుకోవడంతో ఆవేశం పట్టలేని భీమ్ అతన్ని హతమార్చి అస్సాం వెళ్ళిపోయాడు. అక్కడ ఐదేళ్ళపాటు కాఫీ, తేయాకు తోటల్లో పనిచేస్తూ గడిపిన భీమ్ తిరిగి కరిమెర చేరుకున్నాడు. నిజాం నవాబు పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా గిరిజనులను ఒక్కతాటిపై నడిపించి ఉద్యమించాడు. ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు మరియు జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించాడు. కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో నిజాం సైన్యం 1940 అక్టోబర్ 19 న జోడేఘాట్ అడవుల్లోని కొమురం భీమ్ స్థావరాన్ని ముట్టడించి భీమ్ ని హతమార్చాయి. నిజాం సైన్యంమీద, అటవీ సిబ్బంది పైనా కొమరం కొదవు సింహం లా గర్జించాడు. కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి సవూచారంతో, అర్ధ రాత్రిపూట కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 19 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున కొమరం భీమ్ వీరవురణం పొందాడు. అప్పటి నుంచీ ఆ తిథి రోజునే కొమురం వర్ధంతి జరుపుకోవడం ఆదివాసీల ఆనవాయితీగా వస్తుంది. గిరిజన హక్కులు, మనుగడ కోసం పోరాటం సాగించిన కొమరం భీమ్ ఇప్పటికీ తమ ప్రాంతంలోని గోండులచే గౌరవించబడే ఒక ఉద్యమ వీరుడు. యావత్ భారతావని ప్రత్యేకంగా కొలుచుకునే స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన గుర్తుగా ఆసిఫాబాద్ జిల్లాకు కొమరం భీమ్ జిల్లా అని పేరు పెట్టి గౌరవించారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి



**గుంటూరు అక్టోబర్ 21 లక్ష్యం ప్రతినిధి**

ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు శాంతి భద్రత కల్పించిన అమరులు, పోలీసులని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం నగరం పాలెం కుడలిలోని పోలీస్ అమర జవాన్ స్మారక స్థూపం వద్ద అమర పోలీసులకు నివాళులర్పించారు. అమరుల కుటుంబీకులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిందాల్ మాట్లాడారు. దేశంలో ప్రజలకు శాంతి భద్రత కల్పించేది పోలీసులేనన్నారు. విధి నిర్వహణలో, ప్రజలకు శాంతి భద్రతలు కల్పించే క్రమంలో పలువురు ప్రాణాలు కోల్పోయి అమరవీరులయ్యారన్నారు. వారు చేసిన త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. అమర పోలీసు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రజలంతా అందించాలన్నారు. వారి కుటుంబాలకు పోలీసు యంత్రాంగం ,ప్రభుత్వం అన్ని విధాల బాసటగా నిలుస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ భరోసా ఇచ్చారు. నిత్యం విధి నిర్వహణలో ఆటుపోట్లకు ,ఒత్తిడికి గురై 24 గంటల పాటు సేవలు అందించే ఘనత పోలీసులదేనన్నారు. తీవ్రవాదులు, ఉగ్రవాదులు , సంఘవిద్రోహశక్తుల దాడిలో పలువురు అమరులవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం, ప్రజల శాంతి కోసం ప్రాణాలర్పిస్తున్న పోలీసులకు నివాళు లర్పించడం ప్రజలందరి బాధ్యత అని ఎస్పీ జిందాలు అన్నారు.

# సుప్రీం చీఫ్ జస్టిస్ పై దాడికి దిగిన దోషిని కఠినంగా శిక్షించాలి




**గుంటూరు అక్టోబర్ 21 లక్ష్యం ప్రతినిధి**

సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయపైదాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ ను వెంటనే అరెస్టు చేసి ఉరిశిక్ష విధించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. రాకేష్ కిషోర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు .ఈ సందర్భంగా మీరయ్య మాదిగ మాట్లాడారు .జస్టిస్ గవాయికి ,రాకేష్ కిషోర్ కి ఓ కేసు విషయంలో వివాదం ఏర్పడి దాడికి దారి తీయడం జరిగిందన్నారు . ఓ కేసు విషయంలోసనాతన ధర్మాన్ని పాటించేలా తీర్పు ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చిన రాకేష్ కిషోర్ పై చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలన్నారు. కేసును సిబిఐకి అప్పగించాలన్నారు. అలాగే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా సత్వరమే విచారణ జరిపి, ఉరిశిక్ష విధించాలని మీరయ్య మాదిగ డిమాండ్ చేశారు .అప్పటివరకు ఎమ్మార్పీఎస్ ఆందోళన కొనసాగిస్తుందని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందించారు.

# నరసరావుపేటలో “విజన్ 2047” విద్యార్థులతో భారీ ర్యాలీ

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





**నరసరావుపేట అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)::**
ఈ నెల 23న నరసరావుపేటలో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలను ప్రచారం చేయడానికి కళాశాల విద్యార్థులతో భారీ బహిరంగ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో పదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యాలను ప్రజలకు తెలియజేయనున్నారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సారథ్యంలో విద్యాసంస్థల డైరెక్టర్లు ఆధ్వర్యంలో జరగనుంది. నరసరావుపేట ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమావేశంలో విద్యాసంస్థల డైరెక్టర్లు విజన్ 2047 గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ “విజన్ 2047 రాష్ట్రాన్ని 2047 నాటికి సంపన్న, ఆరోగ్యవంత, సుఖవంత రాష్ట్రంగా మార్చే లక్ష్యం. ఇది ప్రధాని నరేంద్ర మోదీ విక్సిత్ భారత్ 2047తో సమన్వయంగా పనిచేస్తుంది. జీరో పేదరికం, 100% సాక్షరత సాధించడం లక్ష్యాలు. %ూ×%, డీప్ టెక్, ఉపాధి సృష్టి ద్వారా ఈ లక్ష్యాలను సాధిస్తాం. యువత, విద్యార్థులు ఈ ప్రక్రియలో కీలకం” అని తెలిపారు. ఈ సమావేశంలో విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన %వీశీఖ%ను ప్రస్తావించారు. అక్టోబర్ 14న కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, రూ.87,520 కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ సామర్థ్యం కలిగిన ఏఐ పవర్డ్ డేటా సెంటర్ స్థాపించబడనుంది. ఇది 5,000-6,000 నేరుగా, 20,000-30,000 మొత్తం ఉద్యోగాలను సృష్టిస్తుంది. “ఈ డేటా సెంటర్ విశాఖను గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా మారుస్తుంది. వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాల్లో ఏ ఐ ద్వారా విప్లవాత్మక మార్పులు వస్తాయి” అని ఎమ్మెల్యే వివరించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు ర్యాలీకి సహకరిస్తామని, విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు.

# వరికపుడిసెల ప్రాజెక్టు పనుల ప్రారంభంపై దృష్టి సారించాలి

## వెల్దుర్తి తాసిల్దార్ కు వరికపుడిసెల జలసాధన సమితి వినతి



**మాచర్ల రూరల్:అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)**
వరికపుడిసెల ఎత్తిపోతల పథకం పనులను త్వరగా ప్రారంభించాలని, రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రాజెక్టుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయాలని కోరుతూ వరికపుడిసెల జలసాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం వెల్దుర్తి తాసిల్దార్ కె.రాజశేఖర్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అంశాలపై దృష్టి సారించి, తమ వంతుగా ప్రభుత్వ అధికారులు, నాయకుల దృష్టికి ఈ విషయాలను తీసుకువెళ్లాలని తాసిల్దార్ రాజశేఖర్ నాయక్ కు జల సాధన సమితి సభ్యులు కోరారు. దశాబ్దాల కల అయిన వరికపుడి లసెల ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి తదితర మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందుతుందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వరికపుడిసెల జలసాధన సమితి సభ్యులు కుర్రి పున్నారెడ్డి, బత్తుల వీరయ్య యాదవ్ (మాజీ సర్పంచ్), జార్జి మాచర్ల, తూము శ్రీనివాసరావు, కోన సాంబయ్య, కె.శివ ప్రసాద్, పల్నాడు శ్రీను పలువురు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీ కలిసిన ఎన్ఎస్ఆర్ కాలనీ గ్రామవాసులు.

## - ఎన్ ఎస్ ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి వినతి పత్రం.

**లక్ష్యం న్యూస్ అక్టోబర్21:-**
నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నాయుడు దయాకర్ రెడ్డి ను కలిసి వినతి పత్రం అందజేశారు.నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల గిరిజన కాలనీ వద్ద రైల్వే గేటు మరమ్మత్తుల పనులతో రైల్వే అధికారులు స్థానిక దళిత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని దయాకర్ రెడ్డి కు వివరించారు.తమ ప్రాంతంలో రైల్వే గేటు మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలియజేశారు.తమ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. సానుకూలంగా దయాకర్ రెడ్డి స్పందించి వెంటనే ఆర్డీవోకు మరియు జిల్లా కలెక్టర్ కు కి ఫోన్ చేసి ఈ సమస్యని త్వరగా పరిష్కరించాలని తెలియజేశారు. అదేవిధంగా త్వరలో రైల్వే శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేస్తానని తెలియజేశారు అదేవిధంగా రైల్వే గేట్లను సందర్శిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తడుకు చందు, జడ వెంకటేష్ , కప్పల మునుస్వామి, దారా శేఖర్, మెండం తులసి, నారాయణ(చంటి), అశోక్, చెంచు ప్రసాద్, యువరాజు, పాల్గొన్నారు.



# మాచర్ల లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

## ఈ నెల 23 నుంచి 30 వరకు సేవలు: కమిషనర్ వేణు



**బాబుమాచర్ల రూరల్ , అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్ ):**
మాచెర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సౌలభ్యం కోసం ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణు బాబు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆధార్ నమోదు, మార్పులు, అప్‌డేట్‌లు వంటి సేవలను సులభతరం చేయడానికి ఈ ప్రత్యేక క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

**శిబిరాల వివరాలు:**

పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లోని మూడు కేంద్రాల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.
జెడ్.పి. బాలికల ఉన్నత పాఠశాల ,జెడ్.పి. బాలుర ఉన్నత పాఠశాల ,అప్పర్ ప్రైమరీ స్కూల్, క్లాక్ టవర్ వద్ద
నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుని సకాలంలో ఆధార్ సంబంధిత పనులను పూర్తి చేసుకోవాలని కమిషనర్ వేణుబాబు సూచించారు. ఈ శిబిరాలను పకడ్బందీగా నిర్వహించడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

# కొల్లిపర మండలంలో మహిళా ప్రగతి సమాఖ్య, యానిమేటర్స్ కు గ్రామ సమైక్య సమీక్ష సమావేశం









**కొల్లిపర అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)**
ఈరోజు మండలంలోని మహిళా శక్తి భవనంలో మహిళా శక్తి సమైక్య, యానిమేటర్లకు గ్రామ సమైక్య సమీక్ష సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో గౌరవ ప్రాజెక్టు డైరెక్టర్ %ు ఎ% విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని, మహిళా ప్రగతి సమాఖ్య, యానిమేటర్స్ కు గ్రామ సమైక్య సమీక్ష సమావేశం గురించి ఈ విధంగా వివరించారు. ప్రతి కాంపోనెంట్ వారీగా తీసుకున్న రుణాలను వారి జీవనోపాదులను అభివృద్ధి చేసు కోవాలని, అలాగే మునగ ఆకు పెంపకం, కోరమేళ్ళు పంపకము, పెరటి కోళ్ల పెంపకము, చిన్న చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేసినారు. %ూ్రా వీ, జజ% లు పాల్గొనటం జరిగింది. అలాగే ఈ సమావేశంలో భాగంగా ఎవరైనా ఆసక్తి గల మహిళలు ఉంటే కుట్టుమిషన్లను కొనుక్కోవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఎం రమాదేవి మరియు సిసి లు మాట్లాడుతూ 2026 మార్చి 8వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలని లక్ష్యంతో భాగంగా డి ఆర్ డి ఏ ద్వారా మండలంలో 400 మంది మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలని స్త్రీ నిధి, సామాజిక పెట్టబడినది నిధి (%జ×ఖీ%), ఉన్నతి, బ్యాంకు లింకేజీ, ద్వారా ఈ నిధులు మహిళలకు అందుబాటులో ఉంటాయని ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి, డి ఆర్ డి ఎ, తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీ.విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రోడక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, ఐ బి డి పి ఎం బి.శివ ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్, డిప్యూటీ సూపర్నెంట్ టి.కోటేశ్వరరావు, బ్యాంకింగ్ లింకేజీ డిప్యూటీ మేనేజర్ కేశవ కుమార్, స్త్రీ నిధి ఏజీఎం హర్షవర్ధన్ పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు








**నరసరావుపేట అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)::**
పల్నాడు జిల్లా నరసరావుపేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం-2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పోలీస్ అమరవీరుల గురించి ప్రభావవంతమైన ప్రసంగం చేశారు. వారు అమరవీరుల ప్రాణత్యాగాలను గుర్తుచేస్తూ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలు దేశ భద్రతకు మార్గదర్శకాలని పేర్కొన్నారు.”పోలీస్ అమరవీరులు మన దేశ రక్షణలో అమరులు. వారి త్యాగాలు మనల్ని శాశ్వతంగా ప్రేరేపిస్తాయి. ఎండా, వానా, చలికాలాలో రాత్రి-పగలు అనే తేడా లేకుండా ప్రజల ప్రాణాల కోసం పోరాడిన వీరులకు మనం శాశ్వత నివాళులు అర్పించాలి. వారి త్యాగాలు మన సమాజంలో శాంతి, భద్రతను బలోపేతం చేస్తాయి. ప్రతి పౌరుడూ వారి ఆదర్శాలను అనుసరించి, దేశ సేవలో పాల్గొనాలి,” అని అన్నారు. అనంతరం, పోలీస్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా ప్రసంగిస్తూ “పోలీస్ శాఖ దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తోంది. అమరవీరుల త్యాగాలు మనల్ని బలపరుస్తాయి. ఈ దినోత్సవం ద్వారా వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను,” అని అన్నారు. జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు మాట్లాడుతూ, “విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లను అందరూ అర్థం చేసుకోవాలి. అమరవీరుల స్ఫూర్తితో మనం ముందుకు సాగాలి,” అని పిలుపునిచ్చారు.

# ఈనెల 24ననగరానికి మైక్రో సాఫ్ట్ సీఈవో రాజీవకుమార్ రాక



**గుంటూరు అక్టోబర్ 21 లక్ష్యం ప్రతినిధి**
మైక్రోసాఫ్ట్ దిగ్గజం రాజీవకుమార్ ఈనెల 24న పేరేచర్లలోని విశదల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే రాష్ట్ర సదస్సుకు, హాజరవుతున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఇంజనీరింగ్ కళాశాలల సంఘ అధ్యక్షులు కోయా సుబ్బారావు వెల్లడించారు. మంగళవారం లక్ష్మీపురం లోని ఎన్నారై కళాశాల హెడ్ బ్రాంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాల నుండి విద్యార్థులు, ఆధ్యాపకులు, ప్రొఫెషనల్ ఐటి రంగ నిపుణులు, ఏఐ రంగ నిపుణులు హాజరవుతారన్నారు. ఈ నెల 24న జరిగే ఈ సదస్సుకు మైక్రోసాఫ్ట్ దిగ్గజం రాజీవ్ కుమార్ హాజరై అధునాతన సాంకేతిక విద్య, మారుతున్న టెక్నాలజీని వివరిస్తారని వెల్లడించారు .శాస్త్ర సాంకేతిక, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వస్తున్న మార్పులను సవివరంగా ఆయన వివరిస్తారని ,ఆలపాటి రాజేంద్రప్రసాద్ ,కోయా సుబ్బారావు వెల్లడించారు. ఈ సదస్సుకు అన్ని ఇంజనీరింగ్ కళాశాలలు హాజరై, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జయప్రదం కోరుతూ రూపొందించిన పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో రాజేంద్రప్రసాద్ ,సుబ్బారావు మాట్లాడారు.

# పార్టీ నాయకులు తమవంతు ఆర్థిక సాయం



**కొల్లిపర అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)**
కొల్లిపర గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి నాయకులు అయోధ్య సుబ్రహ్మణ్యం అనారోగ్యం కారణాల వల్ల మృతి చెందారు. విషయం తెలుసుకున్న భీమవరపులంక కోటి రెడ్డి సుబ్రహ్మణ్యం కుటుంబానికి తమ వంతు సాయంగా 5000 రూపాయలు ఇవ్వటం జరిగింది. వీరి తరుపున షేక్ రఫీ, వీ.బసవయ్య, కేసన పోతురాజు, ఎన్ ఆర్ ఐ వెంకట్ తదితరులు కలిసి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సాయం అందచేసారు.

# అనారోగ్యంతో మరణించిన వారికి పార్టీ నాయకులు తమవంతు ఆర్థిక సాయం



**కొల్లిపర అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)**
కొల్లిపర గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి నాయకురాలు కటారి శివమ్మ అనారోగ్యం కారణాల వల్ల మృతి చెందారు. విషయం తెలుసుకున్న భీమవరపులంక కోటి రెడ్డి సుబ్రహ్మణ్యం కుటుంబానికి తమ వంతు సాయంగా 5000 రూపాయలు ఇవ్వటం జరిగింది. వీరి తరుపున కిరణ్, షేక్ రఫీ, వీ.బసవయ్య, కేసన పోతురాజు, ఎన్ ఆర్ ఐ వెంకట్ తదితరులు కలిసి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సాయం అందచేసారు.

# విద్యుత్ పనులపై ఉన్నతాధికారుల సమీక్ష

## మాచర్ల డివిజన్ కార్యాలయంలో పల్నాడు ఎస్ఈ పర్యవేక్షణ



**మాచర్ల రూరల్, అక్టోబరు 21: (లక్ష్యం న్యూస్ )**
మాచర్ల డివిజన్ పరిధిలో జరుగుతున్న విద్యుత్ పనుల పురోగతిపై పల్నాడు ఎస్ఈ డాక్టర్ పి. విజయ కుమార్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మాచర్ల డివిజన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బి. వెంకటేశ్వర రావు, మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. సింగయ్య కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఈ డా. విజయ కుమార్ డివిజన్ పరిధిలో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని, అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా వ్యవసాయ పనుల పురోగతి, రెవెన్యూ వసూళ్ల తీరు, ఆర్‌డీఎస్ఎస్ పనులు, పీఎం సూర్యఘర్ పథకం అమలు పురోగతిపై ఆయన సమీక్షించారు. వీటితో పాటు ఇతర డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన విద్యుత్ పనుల వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ వసూళ్లలో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డివిజన్‌కు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈలు), అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈలు), అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు (ఏఏవోలు), జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు (జేఏవోలు) పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుడా నీకు వందనం నీ అనిర్వచనీయ త్యాగాన్ని మేము మరువం

**– పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా అక్టోబర్ 21 వ తేదీ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమమును నిర్వహించిన పల్నాడు జిల్లా పోలీసులు.**

**– ముఖ్య అతిథిలుగా పాల్గొన్న పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఐఏఎస్,మరియు నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు**



**నరసరావుపేట అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)::** నర్సరావుపేట లింగంగుంట్ల లోని పోలీసు పెరేడ్ గ్రౌండ్ నందు పల్నాడు జిల్లా ఏ ఆర్ డి.ఎస్.పి జి.మహాత్మగాంధీ పర్యవేక్షణలో అడ్మిన్ ఆర్.ఐ యం.రాజా పరేడ్ కమాండర్ గా ఈ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమం సందర్భంగా స్మృతి పరేడ్ నిర్వహించి విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ పోలీస్ అమర వీరుల స్థూపానికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల మాట్లాడుతూ. సమాజానికి పోలీసు వారు చేసే సేవలు అనిర్వచనం. పోలీస్ వ్యవస్థ లేని సమాజాన్ని మనం ఊహించలేం. పోలీసు వ్యవస్థ లేకపోతే సమాజంలో సంఘవిద్రోహ శక్తుల ఆగడాలకు అడ్డువుండదు. దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశంలో పోలీసులు నిత్యం పహారాకాస్తు ప్రజల ధన మాన ప్రాణాలను రక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఎంతోమంది పోలీస్ వారు సంఘవిద్రోహ శక్తులను అణచివేసే క్రమంలో తమ ప్రాణాలను అర్పించి అసువులు బాసినారు. వారి ప్రాణత్యాగం వెలకట్టలేనిది ఈ సందర్భంగా సమాజ హితం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ మహావీరుల త్యాగాన్ని స్మరించుకోవడం మనకు ఎంతో గర్వకారణం వారి యొక్క స్ఫూర్తిని ముందుకు కొనసాగిస్తూ పోలీస్ శాఖ ప్రజలకు సమాజానికి మరిన్ని సేవలను అందిస్తుందని ఈ సందర్భంగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపీఎస్ మాట్లాడుతూ. 21 అక్టోబర్ 1959 న భారత సైన్యం లఢక్ లోని హాట్ స్ప్రింగ్ అనే ప్రాంతంలో చైనా దురాక్రమణ ను కరమ్ సింగ్, డి.ఎస్.పి నాయకత్వంలో సైనికులు సమర్థవంతంగా తిప్పికొట్టిన రోజు ఇది ఈ సమరంలో కరమ్ సింగ్ తో పాటు 10 మంది భారత సైనికులు అమరులయ్యారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, అక్టోబర్ 21 తేదిన అమర వీరుల సంస్మరణ దినంగా ఈ రోజుని జరుపుకుంటున్నాం. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఎంతో మంది సైనికులు మరియు పోలీసులు సంఘవిద్రోహ శక్తులను ఎదుర్కొనే క్రమంలో ప్రాణ త్యాగం చేస్తున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 26 (వీరిలో 9 మంది పల్నాడు జిల్లా వారు) మంది పోలీసు వారు వీరమరణం పొందడం జరిగినది. వీరందరికీ మనస్ఫూర్తిగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను వీరమరణం పొందిన పోలీసు వారి యొక్క కుటుంబ సభ్యులను ప్రతి సంవత్సరం పిలిచి వారిని సన్మానించుకుని, వారికి ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చడానికి కృషి చేస్తున్నాము. పోలీస్ అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ స్మరించుకుంటూ వారి యొక్క స్ఫూర్తిని పునికి పుచ్చుకొని భవిష్యత్తులో సమాజానికి ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తామని పల్నాడు జిల్లా పోలీసు తరపున తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ, కలెక్టర్ తో పాటు అదనపు ఎస్పీ జె.వి.సంతోష్ (పరిపాలన విభాగం),అదనపు ఎస్పీ క్రైమ్ సిహెచ్.లక్ష్మీపతి, ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తి రాజు, సత్తెనపల్లి డీ.ఎస్పీ యం.హనుమంత రావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి ఎం. వెంకట రమణ, ఏ ఆర్ డి ఎస్ పి మహాత్మా గాంధీ, సిఐలు,ఆర్ఐలు,ఎస్సైలు, పోలీస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ టీ. మాణిక్యాల రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



**కొల్లిపర అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)**

కేరళ తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల మాదిరి ఆంధ్ర ప్రదేశ్ లో కూడా పాడి రైతులకు లీటరుకు 8 రూపాయలు నుండి పది రూపాయలు ప్రోత్సాహక ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం నాయకులు బ్రహ్మేశ్వర రావు తో కలిసి కుంచవరం, అత్తోట, యాదవపాలెం, సిరిపురం గ్రామాల్లో పాల రైతులని కలసి అక్టోబర్ 25వ తేదీన తెనాలి లో ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం జిల్లా మహాసభకు రావలసిందిగా కోరుతూ మంగళవారం కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా శివసాంబి రెడ్డి మాట్లాడుతూ పశువుల ధరలు ఎండు గడ్డి పచ్చి గడ్డి తౌడు దాన పశువుల మందులు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెప్పారు. కానీ ప్రభుత్వం బ్యాంకులో సబ్సిడీలు రుణాలు ఇచ్చి ఆదుకోవడం లేదని ఆయన విమర్శించారు. అమెరికా ట్రంప్ ఒత్తిడికి భారత ప్రభుత్వం లొంగిపోతుంది. దీనివల్ల అమెరికా నుండి పాలు పాల ఉత్పత్తులు భారత్ కు దిగుమతి అయితే పాల రైతులు దివాలా ఎత్తుతారని ఆయన పేర్కొన్నారు. పాల రైతులని పాడి పరిశ్రమను కాపాడుకునేందుకు ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు తెనాలి నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కళ్యాణ మండపంలో జరిగే పాల రైతుల ప్రధమ జిల్లా మహాసభకు రావలసిందిగా కోరారు. జిల్లా నాయకులు యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు మాట్లాడుతూ ప్రైవేటు డైరీలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని కల్తీ పాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో అత్తోట సర్పంచి దేశ బోయిన నాగపుణేశ్వరరావు, తుళ్ళి మిల్లి నాగరాజు, డి గోపయ్య, టి పాములు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



తెనాలి అక్టోబరు21(లక్ష్యంన్యూస్) పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంను పురస్కరించుకుని తెనాలి సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరులకు నివాళి అర్పించింది.మంగళవారం స్థానిక చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహానికి డిఎస్పి జనార్ధన్ రావు నేతృత్వంలో సిఐలు ఎస్సైలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. డీఎస్పీ జనార్ధన్ రావు మాట్లాడుతూ 1959లో భారత్. చైనా సరిహద్దుల్లో లడాక్ ప్రాంతం వద్ద చైనా సైనికులు చేసిన ఆకస్మిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన పదిమంది పోలీసులకు సంస్మరణగా పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన పోలీసులకు నివాళి సమర్పించామని చెప్పారు. అలాగే 1999లో హైదరాబాదులో నక్సలైట్ల దాడిలో మరణించిన ఐపీఎస్ చదలవాడ ఉమేష్ చంద్ర నిజాయితీ, ధైర్యం, ప్రజా సేవకు ప్రతీకగా నిలిచిన ఉమేష్ చంద్ర ఆశయాల స్ఫూర్తిని పోలీసులు అందిపుచ్చుకోవాలని డిఎస్పి జనార్ధన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్, ట్రాఫిక్ సీఐలు ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.

## - భక్తి ,సేవాభావంతో గత 30 నెలలుగా 3000 వేల మందికి అన్న ప్రసాదం



**మంగళగిరి అక్టోబర్ 21 ( లక్ష్యం న్యూస్ ప్రతినిధి)** మంగళగిరి శివాలయం వద్ద గల శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర అన్నదాన మహెూత్సవ కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల సందడితో పాటు భక్తి కాంతులు వెదజల్లుతూ శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం మంగళవారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు తో పాటు అంగ ఉపేంద్ర వర్మ అన్న ప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర వర్మ మాట్లాడుతూ మంగళగిరి పానకాల స్వామి ఆలయ మెట్ల మార్గంలో సాగే ఈ అన్నదాన కార్యక్రమం పరమశివులు ఆశీస్సులతో భక్తుల సహకారంతో ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతూనే ఉందని ఆయన అన్నారు. ప్రతి అమావాస్య రోజున 3000 మందికి అన్న ప్రసాదం అందజేస్తున్న ఈ సేవ కార్యక్రమం నిరంతరంగా కొనసాగించేందుకు ట్రస్ట్ సభ్యులు భక్తులు దాతలు ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు.ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు విశేషమైనవని ఇంత పెద్ద స్థాయిలో భక్తులకు అన్న ప్రసాదం అందించడం ఆధ్యాత్మికతకు మానవత విలువలకు ప్రతీ అని ట్రస్ట్ చైర్మన్, సభ్యులను, ఉపేంద్ర వర్మ అభినందించారు.ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత 30 నెలలుగా ఎటువంటి విరామం లేకుండా ప్రతి నెల అమావాస్య సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం వెనుక 40 మంది దాతల సహకారం ఉందని, వారి ఉదారత వల్లే భక్తులకు ఆహారం అందించే అవకాశం లభిస్తోందని అన్నారు. "భక్తుల సేవే పరమార్థం. ఆకలితో వచ్చే వారు అన్నప్రసాదం స్వీకరించి సంతృప్తిగా వెళ్లడం మాకు ఆనందాన్నిస్తుంది" అని సాంబశివరావు పేర్కొన్నారు. భక్తులు 3 వేల మందికి పైగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారని వారు తెలిపారు..భక్తులకు అన్నదానం చేస్తున్న పందేటి సాంబశివరావుకు వారు అభినందనలు తెలిపారు. గత 30 నెలలుగా భక్తుల సేవలో తరిస్తూ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్న సాంబశివరావును స్థానిక ప్రజలు, భక్తులు కొనియాడారు. సేవాభావంతో ఆయన ప్రతి అమావాస్యనాడు ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం విశేషం. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యనమల నరసింహారావు, కర్నాటి సత్యనారాయణ, ఎన్ ప్రసాదు, దుంపల సొమ్ములు, యనమల నరసింహారావు, కర్నాటి సత్యనారాయణ, ఎన్ ప్రసాద్, దుంపల సోములు, గుద్దంటి మురహరి రావు, పుప్పాల కోటేశ్వరరావు, శ్రీహరి, అన్నపురెడ్డి రామకృష్ణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, నంద్యాల గోపాలకృష్ణ, పంచాల శివన్నారాయణ, ముద్ర బోయిన శ్రీనివాసరావు, మారం మల్లికార్జునరావు, గండికోట రామారావు, కోదాడ శ్రీనివాసరావు, ఆకురాతి శంకరరావు, వీర రాఘవులు, భోజనపల్లి తాండవ, కగ్గా శ్రీనివాసరావు, పందేటి శ్రీనివాసరావు, ఆలూరి ఉమామహేశ్వరరావు, ఆలపాటి రాధిక తదితరులు పాల్గొన్నారు.

# దంపతులకు నకిలీ బంగారం అమ్మి 12 లక్షలు కాజేసిన కర్ణాటక కేడీలు




**గుంటూరు అక్టోబర్ 21 లక్ష్యం ప్రతినిధి**

నగరంలోని కొరటిపాడుకు చెందిన దంపతులకు, త్రవ్వకాల్లో దొరికిన మంచి బంగారం అంటూ 1/2 కేజీ బంగారాన్ని 12 లక్షలకు అమ్మి మోసగించిన కర్ణాటక కు చెందిన తిమ్మాలాపురం గ్రామానికి చెందిన ఇరువురిని అరెస్టు చేసినట్లు వెస్ట్ డీఎస్పీ అరవింద్ వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అరండల పేట సిఐ ఆరోగ్య రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. గత నెల 15వ తేదీన కర్ణాటక రాష్ట్రం బళ్ళారి జిల్లా తిమ్మలాపురానికి చెందిన ఐదుగురు వ్యక్తులు, కోరిటిపాడులోని దంపతులకు రాంగ్ కాల్ చేశారన్నారు .అనంతరం మాటలు కలుపుతూ తమ వద్ద, త్రవ్వకాల్లో దొరికిన బంగారం ఉందని తక్కువ రేట్ కి ఇస్తామని ఆశ చూపారు. అది నిజమని నమ్మిన దంపతులుకర్ణాటక వెళ్లి, అరకిలో బంగారాన్ని 12 లక్షల రూపాయలకు కొనుగోలు చేశారు. అనంతరం దాన్ని తీసుకొని నగరానికి వచ్చి, పరీక్షించగా రాగి జింకు మిశ్రమంతో కూడిన నకిలీ బంగారమని తేలింది అన్నారు. దాంతో తాము మోసపోయామని గుర్తించిన దంపతులు, అరండాలపేట పోలీసులను ఆశ్రయించారన్నారు. ఈ క్రమంలోహెచ్ బి కాలనీకి చెందిన దంపతులనుకూడా వారు ఇదే తరహాలో మోసగిస్తుండగాతాము పసిగట్టి అదుపులోకి తీసుకొని ఇరువురిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్దనుండి ఏడు లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి అరవింద్ వెల్లడించారు. మరో ముగ్గురిని అరెస్టు చేయనున్నట్లు వెల్లడించారు. అత్యాశే ప్రమాదకరమని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు డీఎస్పీ అరవింద్ సూచించారు.

# ప్రజారోగ్యానికి కూటమిప్రభుత్వ ఎనలేని ప్రాధాన్యత : మాజీమంత్రి ప్రత్తిపాటి.

**– వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలకు కూడా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే : ప్రత్తిపాటి**

**– 31 మంది లబ్ధిదారులకు రూ.18లక్షల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందచేసిన మాజీమంత్రి ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట అక్టోబర్ 21 లక్ష్యం న్యూస్**


సీఎం.ఆర్.ఎఫ్ సాయంతో కూటమిప్రభుత్వం ప్రజారోగ్యానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందనే సత్యాన్ని వైసీపీకార్యకర్తలు కూడా గ్రహించారని, తమ అనారోగ్య సమస్యల్ని సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేశ్ కు తెలియచేయడమే అందుకు నిదర్శనమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో యడ్లపాడు, నాదెండ్ల మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అర్హులైన 31 మందికి రూ.17.68 లక్షల విలువైన చెక్కుల్ని స్వయంగా అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తన పాలనలో రాష్ట్ర వైద్యరంగాన్ని కేవలం ఆదాయవనరుగా చూసిన జగన్, పేదల ఆరోగ్య రక్షణ విస్మరించి వారి ప్రాణాలతో ఆటలాడాడని, వేలకోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్ పెట్టాడన్నారు. ప్రజారోగ్యాన్ని రక్షించే కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా సకాలంలో రాష్ట్ర వాటా చెల్లించకుండా ప్రజారోగ్యాన్ని గాల్లో దీపంగా మార్చాడన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కు ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వని జగన్.. నేడు మెడికల్ కాలేజీలు తానే తెచ్చానని చెప్పుకోవడంసిగ్గుచేటన్నారు.కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మదన్ మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు దింతెనపాడు సర్పంచ్ దేవరపు చౌదరి, పోపూరివెంకయ్య,పోపూరిరాఘవయ్య, పోపూరివెంకటరత్తయ్య,పోపూరినాగేశ్వరరావు, గుర్రం స్వాములు టీడీపీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

# జిల్లాఅధ్యక్షునిగా ఎన్నికైన వంగలపున్నారెడ్డి కి అభినందన సత్కారం



తెనాలి అక్టోబరు21(లక్ష్యంన్యూస్) ఆరోగ్య విస్తరణాధికారుల సంఘం జిల్లాఅధ్యక్షునిగా తెనాలి మలేరియాసబ్ యూనిట్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న వంగలపున్నారెడ్డి ఆదివారం జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైనందున తెనాలి మలేరియా, ఫైలేరియా సిబ్బంది కొత్తపేటలోని సహాయ మలేరియాఅధికారి కార్యాలయములో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీ కంఠ ఉమాకాంత్,ఆరోగ్య విస్తరణాధికారి అందెబాలచంద్రమౌళి, పలువురు మలేరియా ఫైలేరియా సిబ్బంది పాల్గొని పున్నారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆరోగ్యవిస్తరణాధికారి అందెబాలచంద్రమౌళి మాట్లాడుతూ జిల్లాలో మన తెనాలిలో పనిచేయుచున్న సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డిని జిల్లా అధ్యక్ష పదవిని వరించడం ఎంతో గర్వకారణమని అన్నారు. పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠఉమాకాంత్ మాట్లాడుతూ సంఘానికి ఎంతో సేవ చేస్తూ మరిన్ని పదవులు అధిరోహించాలని కోరారు. ఎస్ హెచ్ ఐ గుద్దంటి రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సాధక బాధకాలు గ్రహిస్తూ ఎనలేని సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్స్ బండారు మల్లేశ్వరరావు,దాసరిశివ నాగమల్లేశ్వరరావు, తిరువీధుల శివరామప్రసాద్,హెల్త్ అసిస్టెంట్స్ మున్నంగి రత్నాకరరావు,షేక్ నవీద్,షేక్ రషీద్,సయ్యద్ కరిముల్లా,దీపాల శ్రీనివాసరావు, ఆలా వేణుగోపాలరావు,సంకా శరత్ బాబు,షేక్ బాషీద్, మైలా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు ఎన్నికైన జిల్లా సంఘసభ్యులు సూదశివగణేష్ తదితరులకు కూడా ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# శివాలయములో పూరైన కార్తీకమాస ప్రత్యేక ఏర్పాట్లు



**పెదకాకాని, అక్టోబర్ 21, లక్ష్యం న్యూస్ :** పెదకాకాని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో 22వ బుధవారము నుండి నవంబర్ 20వ తేదీ గురువారము వరకు కార్తీకమాసము సందర్భముగా తేదీప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. కార్తీకమాస ఆది, సోమవారము, పౌర్ణమి రోజులలో భక్తుల రద్దీ దృష్ట్యా ఉదయం గం.10.00 వరకు శ్రీ స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకములు అనుమతించబడవని తెలిపారు. ఆలయములో ప్రతి రోజు ఉదయం గం.8.30 నుండి మహాన్యాసపూర్వక రుద్రజప, రుద్రహెూమ మరియు ఏకాథ రుద్రాభిషేకము జరుగునని అలాగే ప్రతి రోజు ఉదయం గం. 9.00 నుండి రుద్రహెూమం, శుక్రవారము, పౌర్ణమి రోజులలో చండి హెూమము, కేధారేశ్వరస్వామివారి వత్రము, సాయంత్రం గం.4.30 నుండి గం.7.00 వరకు అష్టోత్తర పూజ కార్యక్రమము జరుగునని తెలిపారు. పరమేశ్వరునికి అత్యంత ప్రీతిప్రాతమ్మెన కార్తీకమాసములో భక్తుల సౌకర్యార్థము కార్తీకమాసం నిత్య పరోక్షసేవ అభిషేక పథకమునకు భక్తులు రూ.1,000/-లు చెల్లించి పాల్గొను భక్తులకు కార్తీకమాసం అనంతరము శ్రీ స్వామి వారి ప్రసాదముగా శేషవస్త్రము, పంచకజ్జాయ ప్రసాదము వారి చిరునామాకు పోస్టు ద్వారా అందజేయుట జరుగునని తెలిపారు.కావున భక్తులు అధిక సంఖ్యలో కార్తీకమాస నిత్యాభిషేక పథకము నందు పాల్గొని శ్రీ స్వామి వారి అనుగ్రహ కృపాకటాక్షములకు ప్రాతులు కావలసినదిగా, నిత్యాభిషేకము పథకము చేరిన భక్తులకు కార్తీకమాసంలో ఆది, సోమ వారములు, పౌర్ణమి రోజు మినహా ఇతర రోజులలో ప్రత్యేక క్యూల్కెను ద్వారా శ్రీ స్వామి వారి దర్శనమునకు అనుమతించబడునని ఆలయ ఉపకమీషనరు తెలిపారు.కార్తీకమాసములో భక్తులు సౌకర్యార్థము ప్రత్యేక క్యూల్కెనులు ద్వారా తర్వితగతిన శ్రీ స్వామి వారి దర్శనమునకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు, పోలీసు, అగ్నిమాపక, వ్కెద్య, విద్యుత్, గ్రామపంచాయితీ తదితర శాఖల సహకారముతో విజయవంతముగా పూర్తి చేయుట జరుగునని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.

# అంకితభావంతోమహిళల సమస్యల పరిష్కారానికికృషి



**గుంటూరు అక్టోబర్ 21 లక్ష్యం ప్రతినిధి**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు వెళ్తున్నామని,ఇందులో భాగంగానే ప్రతి మంగళవారం 'మహిళా గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 'మహిళా గ్రీవెన్స్ డేను నిర్వహించి, వారి నుండి వినతి పత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ప్రధానంగా కోబాల్ట్ పేట 6వ లైన్ లో పీకల వాగు మీద అక్రమంగా ఇల్లు నిర్మించుకోవటం వలన మురుగునీరు ప్రవాహానికి అడ్డంకిగా ఉండటం వలన ఈ మురుగు నీరు తమ ఇళ్ళలోకి చేరుతుందని, దీని చర్యలు తీసుకోవాలని కొంతమంది మహిళలు వినతిపత్రం అందజేశారు. అదే విధముగా కొంతమంది విభిన్న ప్రతిభావంతులు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు, కన్నావారితోటలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆషా అనే మహిళా తానూ సైబర్ నేరగాళ్ల బారిన పడి సుమారు రూ. 60 వేలు మోసపోయానని, అదే విధముగా కొంతమంది తమ వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వటం లేదని తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు.

## దీపావళి వేడుకల్లో పాల్గొన్న
# శాసనసభ్యులు ప్రతిపాటి పుల్లారావు..



**చిలకలూరిపేట అక్టోబర్ 21 లక్ష్యం న్యూస్**
దీపావళి పండగ సందర్భంగా ప్రతిపాటి పుల్లారావు, కుటుంబ సభ్యులు స్థానిక ప్రజలతో కలిసి ఆనందంగా పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో కలిసి దీపాలు వెలిగించి, పటాకులు పేల్చి, బాంబులు కాల్చి ఉత్సాహంగా సంబరాలలో పాల్గొన్నారు.ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఇంటా వెలుగులు, ఆనందం, ఐకమత్యం నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి సతీమణి వెంకట కుమారి, కుమార్తె డాక్టర్ స్వాతి, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండి సాహితి రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనం ప్లేట్లు పంపిణీ.


అశోక్ రెడ్డి దంపతలను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు.

లక్ష్యం,రాజుపాలెం - మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ హై స్కూల్ లో మంగళవారం గుంటూరుకు చెందిన బండి అశోక్ రెడ్డి వారి పాప పేరు మీద ఏర్పాటు చేసిన బండి సాహితి రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి 330 ప్లేట్లు ను విద్యార్థులకు అందచేజినారు. విద్యార్థులు భోజనం చేయటానికి ప్లేట్లు లేక ఇబ్బంది పడటం గమనించి న పాఠశాల ఉపాధ్యాయుడు అల్లభక్షు సమస్యను ట్రస్టు చైర్మన్ అశోక్ రెడ్డి కి వివరించారు.ఆయన తక్షణమే స్పందిచి విద్యార్థులకు భోజన ప్లేట్లను అందచేశారు. అశోక్ రెడ్డి గతంలో పాఠశాలకు పలు సహాయలు అందించారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ,ఉపాధ్యాయులు. అశోక్ రెడ్డి దంపతలను ఘనంగా సత్కరించారు.

## విమానాశ్రయం కల సాకారం
# : మాచర్ల ప్రాంతంలో కీలక ముందడుగు!

- పశువేముల , నాగులవరం భూముల్లో నిపుణుల బృందం విస్తృత పరిశీలన
- ముఖ్య కార్యనిర్వహణ అధికారి విక్రమ్ కుమార్ కల్రా పర్యవేక్షణ



**మాచర్ల: రూరల్ (లక్ష్యం న్యూస్)**
మాచర్ల మండలం పరిధిలోని పశువేముల , నాగులవరం గ్రామాల్లో విమానాశ్రయం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాలను విమానాశ్రయ సాంకేతిక బృందం మంగళ వారం క్షుణ్ణంగా పరిశీలి ంచింది.ఈ సర్వేకు ఎయిర్‌పోర్ట్ ప్లానర్ %ఽ% డిజైన్ కన్సల్టింగ్ ప్రై. లిమిటెడ్ సంస్థకు చెందిన ముఖ్య కార్యని ర్వహణ అధికారి విక్రమ్ కుమార్ కల్రా కు తాసిల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయం నిర్మాణానికి అత్యంత అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించేందుకు ఈ పర్యటన జరిగింది.

**సమగ్రంగా సాంకేతిక అంశాల పరిశీలన**
కల్రా నేతృత్వంలోని నిపుణుల బృందం ప్రతిపాదిత స్థలంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలను వివరంగా అధ్యయనం చేసింది. ప్రధానంగా, రన్‌వే ఏర్పాటుకు అత్యంత కీలకంగా పరిగణించే గాలి దిశలు , భూమి యొక్క స్వభావం , నేల యొక్క లోతు, దృఢత్వం వంటి వాటిని పరిశీలించారు. అలాగే, భవిష్యత్తులో నిర్మాణాలకు అడ్డంకులు లేకుండా ఉండేందుకు స్థలంలో ఉన్న సహజ వనరుల స్థితిని, పర్యావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.దీంతో పాటు, ప్రాజెక్టు విజయవంతానికి అవసరమైన లాజిస్టికల్ అంశాలపైనా బృందం దృష్టి సారించింది. భూగర్భ జలాల లభ్యత, అధిక సామర్థ్యం గల విద్యుత్ సరఫరాకు ఉన్న అవకాశాలు, విమానాశ్రయానికి జాతీయ రహదారుల నుంచి, ఇతర ప్రధాన రహదారుల నుంచి ఉన్న దూరం వంటి వాటిపై లెక్కలు వేశారు. ఈ బృందం త్వరలోనే తమ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగానే విమానాశ్రయం ఏర్పాటుపై తుది నిర్ణయం, ప్రాజెక్టు రూపకల్పన ప్రక్రియ మొదలవుతాయని అధికారులు తెలిపారు. విమానాశ్రయం రాకతో మాచర్ల ప్రాంతం ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కిరణ్ కుమార్, గ్రామ సర్వేర్లు రాజు , కసన్య నాయక్ ,అయ్యప్ప పలు అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఆధార్ క్యాంపులు

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
మాచర్ల పురపాలక సంఘం పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ డి. వేణుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు రైల్వేగేట్ వద్ద గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పిడబ్ల్యూడీ కాలనీలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కడియార స్థంభం వద్ద గల ప్రాథమికోన్నత పాఠశాల నందు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 30వ తేదీ వరకు జరిగే ప్రత్యేక క్యాంపుల్లో అందించే ఆధార్ సంబంధిత సేవలను పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని ప్రకటనలో కోరారు.

# మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి మానవ మృగం

- హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారు
- అతనికి సమాజంలో తిరిగే నైతికత లేదు
- మీడియాతో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)::**
నరసరావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఒక మానవ మృగం అని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ (వైసీపీ) గుండాలు రాష్ట్రవ్యాప్తంగా హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల జరిగిన కాటికాపరి ఇఫ్రాన్ హత్య వెనక గోపిరెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. అరవింద బాబు మాట్లాడుతూ, నరసరావుపేట నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను గోపిరెడ్డి బెదిరిస్తున్నారని, రౌడీల చేత హత్యా రాజకీయాలు సాగిస్తున్నారని ఆరోపించారు. గత రెండు రోజుల క్రితం (అక్టోబర్ 17, 2025) ఎస్సీ కాలనీకి చెందిన కాటికాపరి గాడిపర్తి ఇఫ్రాన్ (31)ను అతి దారుణంగా హత్య చేశారని, ఇది వైసీపీ గుండాల పనేనని ఆయన పేర్కొన్నారు. స్వర్గపురి-2 లో గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికి హత్య చేసిన ఈ ఘటన వెనక మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఉన్నారని ఆరోపించారు. క్రిస్టియన్ పాలెంలో ఇఫ్రాన్ కుటుంబ సభ్యులపై గతంలో ఖాదర్, ఎజ్రా, మంగపతి రెడ్డి లు గోపిరెడ్డి సహకారంతో దాడి చేశారని, గత ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లో కూర్చోకుండా దాడులు చేశారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా రొంపిచర్ల మండలం మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డిని 2023 ఫిబ్రవరి 2న తుపాకీతో కాల్చి చంపారని, దీని వెనక కూడా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నారని అరవింద బాబు ఆరోపించారు.ఇది పూర్తిగా రాజకీయ హత్యగా అరవింద బాబు అభివర్ణించారు. అలాగే, రంగారెడ్డి పాలెంలో పాదయాత్ర వెంకటేశ్వర రెడ్డిపై వైసీపీ గుండాలు దాడి చేసి, ఆయన ఊరు వదిలి పారిపోయారని ఆయన పేర్కొన్నారు. నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో గోపిరెడ్డి



కావాలని గొడవలు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.మానవ విలువలు లేని మానవ మృగం మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అని, అతనికి సభ్య సమాజంలో తిరిగే నైతికత లేదని అరవింద బాబు తీవ్ర విమర్శలు చేశారు. గోపిరెడ్డి అంటేనే గొడ్డలి పోటు అని, వైఎస్ వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికినట్టు ఇఫ్రాన్‌ను కూడా అదే విధంగా హతమార్చారని ఆయన ఆరోపించారు. వైసీపీ పార్టీ అంటేనే హత్యా రాజకీయాల పార్టీ అని తీవ్ర విమర్శలు చేశారు.

## కాటికాపరి గాడిపర్తి ఎఫ్రాన్ హత్య కేసు లో
# పోలీసుల దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు!

- ఎఫ్రాన్ హత్య కేసు కు మాకు ఎటువంటి సంబంధం లేదు
- మాపై నిరాహార ఆరోపణలతో నిందలు మోపుతున్న ఎమ్మెల్యే అరవింద్ బాబు పై కోర్టులో పరువు నష్టం దావా వేస్తాం

**నరసరావుపేట అక్టోబర్ 21 (లక్ష్యం న్యూస్)::**
స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గపురి 2 లో ఇటీవల కాటి కాపరి గాడిపర్తి ఎఫ్రాన్ అనే యువకుడు అతిగావింపబడ్డాడని ,హత్యకు సంబంధించి పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేసి హత్యకు గల కారణాలు ఏమిటి ? ఎవరు ఈ హత్య చేశారు ? అనేది తెలుసుకున్న తర్వాత ప్రెస్ మీట్ పెట్టి ప్రజలకు తెలియజేయడం ఆనవాయితీ, దర్యాప్తు పూర్తికాకుండానే ఎమ్మెల్యే అరవింద బాబు 3 సార్లు ప్రెస్ మీట్ పెట్టి ఈ హత్య చేసింది వైసిపి పార్టీకి చెందిన వాళ్ళని, ప్రోత్సహించింది గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారని చెబుతున్నాడని, నీవు బాధ్యత గల ప్రజా ప్రతినిధి వేనా? ఎవరు హత్య చేశారో దర్యాప్తు కాకుండానే నీకెలా తెలుసు అని అరవింద బాబును సూటిగా ప్రశ్నించారు ? ఫలానా వారు హత్య చేశారు, అని మీడియా ద్వారా చెప్పి పోలీసులను ప్రభావితం చేయడానికి ఈ రకంగా అరవింద బాబు మాట్లాడుతున్నాడని, ఈ రకంగా పోలీసులను ప్రభావితం చేసి మమ్మల్ని ఈ హత్య కేసులో అన్యాయంగా అక్రమంగా, ఇరికించడానికి ఎమ్మెల్యే అరవింద్ బాబు ప్రయత్నిస్తున్నాడని,నిన్న పత్రికలో ఈ హత్య కేసు దర్యాప్తులో కాటి కాపరి సహాయకుడే హత్యకు కారణం అని రాయడం జరిగింది అని, అయినప్పటికీ అరవింద్ బాబు ఎక్కడా ఆగకుండా,దర్యాప్తు పూర్తి కాకుండానే క్రిస్టియన్ పాలెం నకు చెందిన ఖాదర్ అనే వ్యక్తి హత్య చేశాడని మీడియా ముంద మాట్లాడుతున్నాడని, కొద్దిరోజుల క్రితం హతునికి మరియు ఖాదర్ అనే వ్యక్తి సోదరులకు వాదనలు జరిగాయని ,అయితే ఈ వాదనలు హత్యలు చేసుకునే అంత తీవ్రమైనవి కాదని ,చంపుకునే అంత విభేదాలుగాని , ప్రతికారాలు గాని లేవని, అయితే అరవింద్ బాబు మాత్రం ఈ హత్య కేసులో క్రిస్టియన్ పాలెమునకు చెందిన ఖాదర్ మరియు ఖాదర్ వెనకాల నేనున్నానని చెబుతున్నాడని, నేను నా ఫోన్ ఇస్తాను కాల్ డేటా తీసుకోండి, పోలీసులు సిసి టీవీ విజువల్స్ తీసుకోండి, క్రిస్టియన్ పాలెం నుండి స్వర్గపురి 2 దాకా సుమారు 150 సీసీ కెమెరాలు ఉన్నాయని వీటన్నిటినీ పరిశీలించమని తెలియజేశారు. ఎటువంటి సాక్షాలు ఆధారాలు లేకుండా ఒక మాజీ శాసనసభ్యుని మీద ఈ విధంగా ఆరోపణలు చేయడం సబబు కాదని ,దీనిని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలియజేశారు,వెన్న బాలకోటి రెడ్డి హత్య గురించి కూడా అరవిందబాబు మాట్లాడాడని ఈ హత్య ఎన్నికల ముందు జరిగిందని,ప్రస్తుతం మీ ప్రభుత్వమే అధికారంలో ఉందని నీకు దమ్ముంటే కేసు రీ ఓపెన్ చేసి సిబి సిఐడి ద్వారా దర్యాప్తు చేయించమని, నేను ఎటువంటి ఎంక్వయిరీ కైనా సిద్ధమేనని మీడియా ముఖంగా తెలియజేశారు.అదేవిధంగా వెన్న బాలకోటిరెడ్డి భార్య ఎన్టీవీ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలుగుదేశం పార్టీకి చెందిన పమ్మి వెంకటరెడ్డి అనే వ్యక్తి ఈ హత్యకు కారణం అని చెప్పటం కూడా జరిగింది. ఆధిపత్యపోరు లో భాగంగానే వెన్నా బాలకోటి రెడ్డి హత్య జరిగిందని స్పష్టంగా అందరికీ తెలుసు అయినప్పటికీ అరవింద్ బాబు దీని గురించి కనీసం ఒక వంద సార్లు మాట్లాడాడు, ప్రభుత్వ నీదే కదా !దమ్ముంటే ఈ హత్య కేసు విచారణ రీ ఓపెన్ చేసి విచారణ జరిపించు! మేము దేనికైనా సిద్ధమే అని మీడియా ద్వారా ఛాలెంజ్ చేశారు. ఒక ఎమ్మెల్యేగా ఉండాల్సిన గౌరవం ఎక్కడ లేకుండా , ఏది పడితే అది ఎక్కడ పడితే అక్కడ మాట్లాడుతున్నావని ,నీకు లీగల్ నోటీసులు ఇచ్చి కోర్టు ద్వారానే తెలుస్తామని ,ఈ హత్యకు ఖాదర్కు, నాకు ఎటువంటి సంబంధం లేదని, పోలీసులు కాల్ డేటా కూడా తీసుకున్నారని, సిడిఆర్ కూడా తీసుకున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇప్పుడు పోలీసులు ఒత్తిడి చేయడానికి అతని కుటుంబాన్ని మీడియా ముందుకు తీసుకువచ్చి ట్రైనింగ్ ఇచ్చి మాట్లాడిస్తూ డ్రామా చేస్తున్నాడని, ఎన్నికల సమయంలో ఖాదర్ కోడి గుడ్లు విసిరాడని అతని మీద ఎలాగైనా ఈ కేసును ఇరికించాలని ప్రయత్నం చేస్తున్నాడని ,అనేక సార్లు ఖాదర్ను పోలీస్ స్టేషన్లో పెట్టించి కొట్టించాడని ,5వ వార్డు నుంచి ప్రెసిడెంట్ పదవి కోసం అక్కడి టిడిపి నాయకులు వెళితే ఖాదర్ తల తీసుకొస్తే మీకు పార్టీ పదవి ఇస్తానని వాళ్లతో చెప్పడం కూడా జరిగిందని, ఎలాగైనా ఖాదరను ఈ కేసులో ఇరికించాలనే వ్యూహం పన్నుతున్నాడని, దీంట్లో భాగంగానే పోలీసులు ఒప్పుకోకపోతే హోమ్ మినిస్టర్ దగ్గరకు లోకేష్ దగ్గరకు తీసుకువెళ్లి పోలీసులు మీద ఒత్తిడి తీసుకొచ్చి ఒప్పుకునేటట్టు చేయాలని ప్రయత్నిస్తున్నాడని, గుడ్ల కాల్చి నెత్తిన వేసే ఇటువంటి ఆరోపణలపై కోర్టు ద్వారానే తేల్చుకుంటామని లీగల్ నోటీసులు ఇచ్చి అరవింద బాబు పై పరువు నష్టం దావా వేస్తామని తెలియజేశారు. అదేవిధంగా ఈరోజు వరవ కట్టలు షాపులు తగలబడితే అవి కూడా మేము తగలబెట్టించామని అంటున్నాడని, నరసరావుపేటలో ఏది జరిగిన వైసీపీకి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నాడని స్టేడియంలో మాట్లాడుతూ అవినీతి గురించి మాట్లాడుతున్నాడని, ఈయన కూడా అవినీతి గురించి మాట్లాడేవాడెనా, కోటప్పకొండ నుండి మట్టి తీసుకెళ్లే లారీలకు ఒక్కొక్క లారీకి 800 చొప్పున లంచం తీసుకుంటున్నాడని ,ఏ ఎం ఆర్ దగ్గర 2000 రూపాయలు తీసుకొని టోకెన్ ఇవ్వటం జరుగుతుందని, దీంట్లో 1200



ప్రభుత్వానికి ,800 అరవింద బాబుకు అక్కడి నుంచే వెళతాయని ఈ సందర్భంగా తెలియజేశారు.మా హాస్పటల్ పక్కనే ఒక బిల్డింగ్ పని జరుగుతుంటే బిల్డింగ్ పర్మిషన్ కోసం 15 లక్షల రూపాయలు తీసుకున్నాడని ఆ పక్కనే మరొక బిల్డింగ్ కన్స్ట్రక్షన్ జరుగుతుంటే 5 లక్షల రూపాయలు వసూలు చేశాడని రంగా వారి వీధిలో ఒక స్థలం వ్యవహారం సెటిల్మెంట్ లో 20 లక్షల రూపాయలు వసూలు చేశాడని రావిపాడు రోడ్డు లో వెంచర్లో 80 లక్షల రూపాయలు తీసుకున్నాడని ,.సీఎంఆర్ ఫ్ చెక్కులు సంబంధించి పంపిణీలో ప్రజల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని టిడిపికి చెందిన టీవీ ఫైవ్ లోనే కథనాలు వస్తున్నాయని,కోటప్పకొండ ఇనాం భూముల్లోనే మట్టి తవ్వుకునే కార్యక్రమం చేస్తున్నాడని టీవీ5, ఈటీవీలలో కథనాలు వచ్చాయనినీకు తెలియకుండానే ఇనాం భూముల్లో మట్టి అమ్ముకుంటారా? అని ఈ సందర్భంగా ప్రశ్నించారు.

స్టేడియం విషయానికొస్తే స్విమ్మింగ్ పూల్ ఇంతవరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేకపోయావని, నువ్వు వచ్చాక ఏం పని చేశావు ?అని ప్రశ్నించారు అవిశ్వాయపాలెం టు కోటప్పకొండ రోడ్డుకు పవన్ కళ్యాణ్ నిధులు ఇవ్వడం జరిగితే సంవత్సరం అయింది ,ఇప్పటికీ ఇంతవరకు ఆ రోడ్డు వేసిన పాపాన పోలేదని, జెఎన్టియు హాస్టల్లో ఇంతవరకు ఒక్క ఇటుక కూడా వేయలేదని నరసరావుపేట మున్సిపాలిటీలో ఇక చెప్పాల్సిన పనిలేదని, ఇతని అవినీతికి అంతమే లేదని, సమాధులు కూడా క్లీన్ చేయడానికి ఎవరు పోవడం లేదని ,పత్రికా ముఖంగా ఒకటే కోరుతున్నానని పోలీసులు ఈ హత్య కేసును నిష్పాక్షపాతంగా దర్యాప్తు చేయాలని నిజమైన దోషులు ఎవరో గుర్తించి తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని ,హత్యకు గురైన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, అయితే ఆధారాలు ,సాక్షాలు లేకుండా ఒక ప్రజా ప్రతినిధి పై ఈ విధంగా మాట్లాడటం సమంజసం కాదని, అరవింద్ బాబు చేసిన ఆరోపణలపై కోర్టు ద్వారా అరవింద్ బాబు పై పరువు నష్టం దావా వేసి న్యాయస్థానంలోనే ఈ వ్యవహారం పై తేల్చుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# గర్భిణీలు, బాలింతలు కొరకు కిల్కారి కాల్స్

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
మాత శిశు మరణాలు తగ్గించటానికి కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్ ని ప్రవేశ పెట్టటం జరిగిందని రీజినల్ కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ బి. రాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రీజినల్ కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ బి. రాజు, జిల్లా ఆశ అధికారి ఎన్. సురేష్ సందర్శించారు. పి.హెచ్.సి లో సూపర్వైజర్లు ద్వారా కిల్కారి ప్రోగ్రాం ఏ విధంగా గర్భిణీలు, బాలింతలకు ఉపయోగపడుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాల్వాయి గేట్ సచివాలయంలో ఫీల్డ్ విజిట్ చేసి డ్కెరెక్ట్ గా గర్భిణీలు, బాలింతలు ను కలసి కిల్కారి కాల్స్ ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో, కాల్స్ వినకపోవటానికి గల కారణాలు వారిని అడిగి తెలుసుకున్నారు. కిల్కారి అంటే చిరునవ్వు అని అర్థమని, గర్భిణీ నాలుగో నెల నుంచి పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు కిల్కారి కాల్స్ రావడం జరుగుతందని, వాళ్ళు ఏ వారంలో ఎలాంటి జాగ్రత్తులు తీసుకోవాలో అవన్ని వాయిస్ కాల్స్ ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తారని తెలిపారు. 911600103660 అనే నెంబర్ నుంచి కిల్కారి కాల్ వస్తుంది, గర్భిణీలు, బాలింతలు వాళ్ళ మొబ్కెల్ లో ఈ నెంబర్ సేవ్ చేసుకుంటే వచ్చినపుడు ఎత్తి వినగాలుగుతారని, మరల తిరిగే వినాలి అంటే 14423 నెంబర్ కి చేసి వినవచ్చుని చెప్పారు. మాత శిశు మరణాలు తగ్గించటానికి కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్ ని ప్రవేశ పెట్టిందని, ఈ కిల్కారి సేవలను గర్భిణీలు, బాలింతలు ఉపయోగించుకొని తల్లిబిడ్డ ఆర్యోగంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆశ అధికారి సురేష్ , డాక్టర్ వెస్లీ గారు,


సూపర్‌వైజర్లుతో మాట్లాడుతున్న కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ బి. రాజు

రమాదేవి, ఎలిజబెత్, వెంకటేశ్వరావు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# అంతరాయం లేని సాగు నీటి సరఫరా జరగాలి




**గుంటూరు, అక్టోబర్ 21లక్ష్యం ప్రతినిధి జిల్లాలో** సాగునీటి కాలువలు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగు నీటి కాలువలు క్రింద ఉన్న తాగునీటి చెరువులను నింపుటకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. జిల్లాలోని భారీ సాగు నీటి కాలువలు కే డబ్ల్యు డెల్టా, గుంటూరు కెనాల్స్, నాగార్జున సాగర్ ప్రాజెక్టు సత్తెనపల్లి, లింగాయపాలెం బ్రాంచ్ కాలువల పరిధిలోని సాగు భూముల విస్తీర్ణం, వరదనీటి డ్రైయిన్లు వివరాలను మ్యాప్ లు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాలువల నిర్వహణ, మరమ్మత్తులు, అభివృద్ధికి మంజూరు చేసిన పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి వేగవంతంగా పనులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి, విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ ను వెంటనే పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. కెనాల్స్ లో పూడికతీత, నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా నిరంతరం అధికారులు పర్యవేక్షించాలన్నారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటరత్నం, ఈఈ రమేష్, డ్రైయినేజ్ విభాగం డీఈ ధనలక్ష్మి, ఏఈలు పాల్గొన్నారు

# ట్రంప్ కు వ్యతిరేకంగా ఆగ్రహజ్వాలలు

## సంస్కరణల పేరుతో సంక్షోభంలోకి..

**వాషింగ్టన్ అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**


అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపటి పది నెలలు కావస్తోంది. ట్రంప్ 2.0 పాలనలో తీసుకుంటున్న నిర్ణయాలన్నీ వివాదాస్పదమవుతున్నాయి. అమెరికా ఫస్ట్.. గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్ నినాదాలతో అధికారంలోకి వచ్చిన ట్రంప్.. వాటిని సాకారం చేసేందుకు తన పరిధి మించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో ఇటు అమెరికన్లు.. అటు ప్రపంచ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. దేశ రాజకీయ దిశను ఒక్కసారిగా మార్చుతున్నాయి. ప్రధానంగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల వరద, పరిపాలనా సంస్కరణల పేరిట జరుగుతున్న భారీ ఉద్యోగాల తొలగింపులు, వలస విధానాల్లో కఠిన మార్పులు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రగిలించాయి. ఈ నేపథ్యంలో ట్రంప్‌పై అమెరికాలోనే తిరుగుబాటు మొదలైంది. అక్టోబర్ 18న దేశవ్యాప్తంగా 'నో కింగ్స్' పేరుతో జరిగిన భారీ నిరసనలు, అమెరికా ప్రజాస్వామ్యంలో ప్రజల అసహనానికి ప్రతిబింబంగా నిలిచాయి. 50 రాష్ట్రాల్లో సుమారు 2,500 ప్రదేశాల్లో జరిగిన ఈ ఆందోళనల్లో విస్తార ప్రజాభాగస్వామ్యం కనిపించింది. ట్రంప్ నిర్వహిస్తున్న పరిపాలన పునర్వ్యవస్థీకరణలో సామాజిక, లైంగిక, వలస అంశాలు ప్రధానాస్థానంలో నిలిచాయి. ట్రాన్స్ జెండర్ రక్షణల సడలింపులు, పౌరసత్వ నియమాల కొత్త



ముసాయిదాలు, వలసదారుల సోదాలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'డోజ్' కమిటీ చర్యల ఫలితంగానే వేలాది ప్రభుత్వ ఉద్యోగులు తొలగించబడ్డారని మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి పరిణామాలు సామాజిక ఆందోళనలకు కారణమవగా, నిరసనకారులను అడ్డుకునేందుకు జాతీయ బలగాలను రాష్ట్రాల్లో మోహరించడం విమర్శలకు దారితీసింది. ఇది ట్రంప్ నియంత్రణశైలిని 'నిరంకుశ పాలన'గా పేర్కొనడానికి నిరసనకారులకు మరింత బలం ఇచ్చింది. జూన్ నెలలో వాషింగ్టన్‌లో జరిగిన సైనిక పరేడ్ నేపథ్యంతో ట్రంప్ విధానాలకు వ్యతిరేక నిరసనలు మరింత పెరిగాయి. లక్షలాది మంది రోడ్లపైకి వచ్చి 'ప్రజాస్వామ్యంలో రాజులు లేరు' అనే నినాదంతో గళమెత్తారు. సెనెట్ నేత చక్ షూమర్, కాంగ్రెస్ సభ్యుడు బెర్నీ సాండెర్స్‌లతోపాటు పలువురు రాజకీయనాయకులు, కార్యకర్తలు ఆందోళనల్లో పాల్గొన్నారు. ఈ ఉద్యమం కేవలం పార్టీ పరిమితికి మించి, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటంగా మారింది. ఇదిలా ఉంటే మూడు వారాలుగా ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతోంది. అనేక శాఖలు మూతపడడం, లక్షలమంది ఉద్యోగులు జీతాలు లేక ఇబ్బందులు పడటం దేశవ్యాప్తంగా అసహనాన్ని పెంచింది. పరిపాలన స్థబ్దతను ప్రజలు ట్రంప్ విధానాల నేరుగా ఫలితమని భావిస్తున్నారు. ఇదే అసంతృప్తి 'నో కింగ్స్' నిరసనలను మరింత వ్యాప్తి చేయడానికి దోహదమైంది. వైట్ హౌస్ ఎన్నడూ లేని విధంగా రక్షణాత్మక వైఖరిని అవలంబిస్తోంది. రిపబ్లికన్ మద్దతుదారులు నిరసనకారులను 'అమెరికా వ్యతిరేక వర్గాలు'గా అభివర్ణిస్తుండగా, అధ్యక్షుడు ట్రంప్ మాత్రం నేను రాజును కాదు, ఎన్నికైన నాయకుణ్ని మాత్రమే' అని వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్య నిరసనలను ఆపలేకపోయింది. పలురాష్ట్ర గవర్నర్లు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ జాతీయ బలగాలను సిద్ధంగా ఉంచారు. నిరసనకారుల పంచిన ఆన్‌లైన్ పత్రికలలో, అమెరికా రాజ్యాంగ విలువలను కాపాడటం తమ ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం అమెరికా 'ప్రజాస్వామ్యం వర్సెస్ వ్యక్తి ఆధిపత్యం' అనే చర్చలో చిక్కుకుపోయినదని విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ సంస్కరణలు ఎక్కువగా వ్యక్తిస్వేచ్ఛల ఖాతాలో భారం పెడుతున్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'నో కింగ్స్' ఉద్యమం తాత్కాలిక నిరసనకాక, ప్రజా స్వరాన్ని మళ్లీ ముందుకు తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తోంది.

# విద్యుత్ అధికారులతో సమీక్ష



**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**

మాచర్ల డివిజన్ కార్యాలయం నందు విద్యుత్ అధికారులు, సిబ్బందితో పల్నాడు సూపర్నిటెండిరగ్ ఇంజనీర్ డా. పి. విజయ్ కుమార్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బి. వెంకటేశ్వరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. సింగయ్యలు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో అగ్రికల్చర్ వర్క్స్, రెవెన్యూ కలెక్షన్స్, ఆర్‌డిఎస్‌ఎస్ వర్క్స్, పీఎం సూర్యా ఘర్ ప్రోగ్రెస్ గురించి, ఇతర డిపార్ట్మెంట్ చెందినటువంటి పనుల గురించి రివ్యూ చేశారు. ఈ సమావేశంలో డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## కార్తీకమాసోత్సవాల ఏర్పాట్ల పై సెక్షన్ అధికారులతో సమీక్షించిన ఈ ఓ

**లక్ష్యం న్యూస్ :శ్రీశైలం:**

**- నేటి 22 నుంచి నవంబరు 21 వరకు కార్తీకమాసోత్సవాలు(- కార్తీకమాసోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు - ప్రణాళికబద్ధంగా క్యూలైన్ల నిర్వహణ - పాతాళగంగ వద్ద పుణ్యస్నానాలకు తగు ఏర్పాట్లు- భక్తులు కార్తీకదీపారాధనలు చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తరమాడవీధిలో మరియు గంగాధర మండపం వద్ద అవసరమైన ఏర్పాట్లు**



21.10.2025 కార్తీకమాసోత్సవాల ఏర్పాట్ల సమీక్ష

- కార్తీకమాసమంతా కూడా ఆర్జిత అభిషేకాలు ( గర్భాలయ మరియు సామూహిక అభిషేకాలు) నిలుపుదల

అక్టోబరు 22 నుంచి నవంబరు 21 వతేదీ వరకు కార్తీకమాసోత్సవాలు నిర్వహింపబడనున్నాయి.

ఈ సందర్భంగా కార్తీకమాసోత్సవాల ఏర్పాట్లను మంగళవారం నాడు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు సెక్షన్ అధికారులతో సమీక్షించారు.

ఈ సమావేశంలో ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపక, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్. రమణమ్మ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం. నరసింహారెడ్డి, అన్ని శాఖల అధిపతులు, వివిధ విభాగాల పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సమీక్షలో భక్తులకు దర్శనం ఏర్పాట్లు, మంచినీటిసరఫరా, పాతాళగంగలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు, భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కల్యాణకట్టలో ఏర్పాట్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వైద్యఆరోగ్యసేవలు, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్యం ఏర్పాట్లు మొదలైన అంశాల గురించి కార్యనిర్వహణాధికారివారు పలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

అదేవిధంగా కార్తీకమాసంలో ప్రతీసోమవారం మరియు కార్తీకపౌర్ణమిరోజున జరిగే పుష్కరిణి హారతి, లక్షదీపోత్సవం, పౌర్ణమినాటి జ్వాలాతోరణోత్సవం, అక్టోబరు 31వ తేదీన జరిగే కృష్ణమ్మహారతి, నవంబరు 14న జరిగే కోటి దీపోత్సవం, నవంబరు 18వ తేదీన జరిగే తెప్పోత్సవం ఏర్పాట్లను కూడా కార్యనిర్వహణాధికారి సమీక్షించారు.

ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ ప్రతీరోజు వేకువజామున 3గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రాత:కాలసేవలను జరిపించిన అనంతరం వేకువజామున గం. 4.30ల నుంచి సాయంత్రం గం. 4.00ల వరకు దర్శనాలను కొనసాగించాలన్నారు. అదేవిధంగా తిరిగి సాయంత్రం గం. 5.30ల నుంచి రాత్రి గం. 10.30ల వరకు కూడా దర్శనాలను కొనసాగాలన్నారు.

సాధారణ భక్తుల సౌకర్యార్థం కార్తీకమాసమంతా కూడా గర్భాలయ అభిషేకాలను మరియు సామూహిక అభిషేకాలను పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు.

కార్తికమాసంలో శని,ఆది,సోమవారాలు మరియు పర్వదినాలలో ( 16 రోజులపాటు) అమ్మవారి అంతరాలయంలో నిర్వహించు కుంకుమార్చనలు ( రూ. 1000/- రుసుము) కుంకుమార్చనలను ఆశీర్వచన మండపంలో నిర్వహించాలన్నారు.

రుద్రహెూమం, చండీహెూమం, సాక్షిగణపతిహెూమం, నిత్యకల్యాణం మొదలైన ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

కాగా క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాటలు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూకాంప్లెక్సులో అల్పాహారం, బిస్కెట్లు, మంచినీటిని నిరంతరం అందిస్తుండాలన్నారు. పర్వదినాలలో క్యూలైన్లలో వేడిపాలను కూడా అందజేయాలన్నారు.

ప్రతీరోజు కూడా ఉదయం గం. 10.45ల నుంచే అన్నప్రసాదవితరణను ప్రారంభించాలన్నారు. సాయంత్రం గం. 7.00ల నుంచి భక్తులకు అల్పాహారం అందజేయాలన్నారు.

ప్రస్తుతం ఉన్న 7 ప్రసాదాల విక్రయకేంద్రాలకు అదనంగా రద్దీని బట్టి మరో 3 లేదా 4 కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని లడ్డు ప్రసాదాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

కార్తీకమాసంలో భక్తులు పుణ్యస్నానాలకు ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా పాతాళగంగ వద్ద అవసరమైన ఏర్పాట్లన్నీ కూడా పకడ్బందీగా ఉండాలన్నారు. పాతాళగంగ వద్ద శౌచాలయాల నిర్వహణ, పారిశుద్ధ్యం, అదనపు లైటింగ్ ఏర్పాట్లు, ఈత నిపుణుల ఏర్పాట్లు మొదలైన అన్నీ కూడా ఎటువంటి లోటు లేకుండా ఉండాలన్నారను.

భక్తులు సమాచారం తెలుసుకునేందుకు అవసరమైన అన్నీ ప్రదేశాలలో కూడా మరిన్ని సూచికబోర్డులు ఉండాలన్నారు.

ఆలయ ఉత్తరమాడవీధిలోనూ మరియు ఆలయ ముందుభాగంలోని గంగాధర మండపం వద్ద భక్తులు కార్తీక దీపరాధనకు తగు ఏర్పాట్లు వుండాలన్నారు.

కార్తీకమాసంలో నిర్వహించబడే లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలను, జ్వాలాతోరణోత్సవాన్ని, కృష్ణమ్మహారతి కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలన్నారు.

అదేవిధంగా ఈ సంవత్సరం నూతనంగా ప్రవేశపెట్టిన కోటిదీపోత్సవం మరియు తెప్పోత్సవ కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు ఉండాలన్నారు.

గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు కోటిదీపోత్సవానికి, పాతాళగంగ వద్ద తెప్పోత్సవానికి ఆయా ఏర్పాట్లన్నీ ముందస్తుగానే పూర్తి చేయాలన్నారు.

స్థానిక పోలీస్‌శాఖ వారి సహకారంతో భద్రతా ఏర్పాట్లు ఉండాలన్నారు. ముఖ్యంగా వాహనాల క్రమబద్ధీకరణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్షేత్రపరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన వీధులు మొదలైన చోట్ల చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలన్నారు.

కార్తీకమాసోత్సవాలలో దేవస్థానం సిబ్బందికి అదనపు విధులు కేటాయించడం జరిగిందని, సిబ్బంది అందరు కూడా పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు.

# బీసీ ఉద్యమానికి అండగా...వ్యూహం రచిస్తున్న బీఆర్ఎస్

**హైదరాబాద్, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

తెలంగాణ రాజకీయాల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే.. ఆ పార్టీ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీ. అయితే.. అప్పటి పేరు తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్). ఇప్పుడది బీఆర్ఎస్. స్వరాష్ట్ర సాధన కోసం పార్టీ ప్రజలను ముందుండి నడిపించింది. చివరకు ప్రజల కలలు నెరవేరి స్వరాష్ట్ర కల సాకారమైంది. ఆ పార్టీ అధికార పగ్గాలు చేపట్టి అప్రతిహతంగా పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కొన్నా ళ్లు ఆటుపోట్లు ఎదుర్కొన్న గులాబీ శ్రేణు లు తాజాగా బీసీ కోటా ఉద్యమం తెరమీదకు వచ్చిన తర్వాత మళ్లీ పుంజుకునే ప్రయత్నాలు చేస్తున్నది. బీసీలు 42 శాతం రిజర్వేషన్ కోసం చేస్తున్న ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించి వచ్చే ఎన్నికల్లో విజ యానికి బాటలు వేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థుల సమస్యలు, కోల్పోతున్న నదీ జలాల హక్కుల వైఫల్యాలను తిరిగి ప్రజలకు వివరించాలని, తద్వారా మళ్లీ ప్రజల మద్దతు కూడగట్టే దిశగా అడుగులు వేస్తున్నది. కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా ఉద్యమాల రూపంలో తిరిగి ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణను రూపొందిస్తుంది. తద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాలని చూస్తున్నది. నాడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నాటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) ఆవిర్భావానికి కారణమైంది. ప్రజల ఆశ లు, ఆత్మగౌరవం, స్వపరిపాలన అనే నినాదాలతో ప్రారంభమైన ఆ ఉద్యమం ఒక పార్టీని మాత్రమే కాకుండా, ఒక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే బీఆర్ఎస్ అధికారానికి దూరమైనా, ప్రజాఉద్యమాల ద్వారా మళ్లీ ప్రజల నాడిని తాకే ప్రయత్నం చేస్తోంది. దానికి బీసీ ఉద్య మం వేదిక కానున్నది. బీసీ ఉద్యమం తెలంగాణ రాజకీయాల్లో కొత్త చైతన్యాన్ని తీసుకొస్తున్నది. రిజర్వేషన్, ప్రాతినిధ్యం, కుల గణన వంటి అంశాలపై బీసీ వర్గాల్లో పెరుగుతున్న అసంతృప్తి ఒక కొత్త సామాజిక శక్తిగా రూపుదిద్దుకుంటోంది. ఈ పరిణామాలను సానుకూల దిశగా మల్చుచుకునే అవకాశం ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ వచ్చింది. గతంలో ఉద్యమాలను ముందుండి



నడిపించిన అనుభవం బీఆర్ఎస్ పార్టీకి ఒక మార్గదర్శకంలా ఉపయోగపడుతుంది. నాడు తెలంగాణ కోసం చేసిన పోరాటం ద్వారా రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ ఏకం చేసింది. ఇప్పుడు బీసీల హక్కుల కోసం ఉద్యమం కూడా అదే వైఖరిని అవలంబించనున్నది. సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా అమలు చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారం చేపట్టాక బీసీ కోటా అమలుకు బిల్లు చేసింది. ఆ చట్ట సవరణ చేయడంలో బీజేపీ నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నది. కోటా అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని బీసీలు భావిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణనలో గందరగోళం, నిబంధనల అమలులో తడబాటు, రాజకీయ ప్రాతినిధ్యంలో నిర్లక్ష్యం.. బీసీ వర్గాల్లో తీవ్రమైన అసంతృప్తి వచ్చింది. ఆ రెండు పార్టీలకు ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా తనకు అనుకూలంగా మార్చుకుంటున్నది. మళ్లీ రాజకీయంగా పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ప్రతిపక్షాల వైఫల్యాన్ని పరిగణనలోకి తీసుకుని బీసీ వర్గాల అసంతృప్తిని మద్దతుగా మార్చడం, ప్రజా సమస్యలను తన ప్రత్యేక గుర్తింపుగా ప్రజల ముందుకు తీసుకురావడమే ప్రధాన వ్యూహంగా అడుగులు వేస్తుందిస్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫలం కాలేదనే అభిప్రాయం ప్రజానీకంలో ఉంది. ఈ అభిప్రాయం బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతున్నది. రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ బీసీ రిజర్వేషన్ల అమలుకు పలు ప్రయత్నాలు చేసింది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపింది. తర్వాత పరిణామాల్లో కోటా అమలు పెండింగ్‌లో పడింది. ఆ పార్టీ మొదటి నుంచీ బీసీలకు ప్రాధాన్యమిస్తూ వస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక ప్రాతినిధ్యం కల్పించడం, బీసీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం వంటి నిర్ణయాలు బీసీల్లో ఆ పార్టీకి విశ్వసనీయతను పెంచాయి. బీసీ రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చాక రాష్ట్రంలో మరోసారి రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. కులగణన, రిజర్వేషన్ పరిమితులు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి నేపథ్యంలో బీసీ సమాజం తిరిగి బీఆర్ఎస్ వైపు చూడే అవకాశాలు పెరుగుతున్నాయి. రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ కొత్త ఆయుధాలుగా మార్చుకునే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో బీసీలకు ప్రత్యేక గుర్తింపు, పథకాలు, రాజకీయ అవకాశాలు ఇచ్చిన పార్టీగా బీఆర్ఎస్ తన బలాన్ని మళ్లీ గుర్తు చేయాలనే యత్నంలో ఉంది. బీసీ ఉద్యమం ఇప్పుడు కేవలం సామాజిక డిమాండ్ మాత్రమే కాకుండా బీఆర్ఎస్ రాజకీయ పునరుద్ధరణకు దారితీయగల అవకాశంగా మారింది. ఈ అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకుంటే బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం వస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుతెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ప్రస్తుతం ఒక స్పష్టమైన వ్యూహాన్ని ప్రదర్శిస్తున్నది. రాష్ట్ర మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. కేవలం ఎన్నికల సమయం మాత్రమే కాకుండా ప్రజా సమస్యలను పట్టించుకుని, పరిష్కారానికి గళమెత్తడం, సామాజిక ఉద్యమాలను పార్టీ బలంగా మార్చుకునే దిశగా అడుగులు వేస్తున్నది. ప్రజల ఆవేదనను సానుకూలంగా మార్చుకుంటూ మళ్లీ ప్రజల మద్దతు పొందే అవకాశాన్ని పెంచే ప్రయత్నం చేస్తుంది. దీంతోపాటు పాలక పక్షాల వైఖరి, ప్రభుత్వ నిర్లక్ష్యం, అన్ని వర్గాల అసంతృప్తి బీఆర్ఎస్‌కు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతున్నాయి. ప్రజాఉద్యమాల నుంచి వచ్చిన సామాజిక చైతన్యాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని, కేడర్‌ను ఉత్సాహపరిచి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు గులాబీ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నాయి.

# నియోజకవర్గ అభివృద్ధి.. కొండవీడు కోటకు పూర్వవైభవం అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించిన మాజీమంత్రి ప్రత్తిపాటి.

**-రూ.100 కోట్ల అంచనా వ్యయంతో కొండవీడు అభివృద్ధిపై రూపొందించిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందించిన ప్రత్తిపాటి.**

**-చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కొండవీడు కోట అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపండి : మాజీమంత్రి ప్రత్తిపాటి.**



**చిలకలూరిపేట అక్టోబర్ 21 లక్ష్యం న్యూస్**

ప్రఖ్యాత చారిత్రక ప్రదేశమైన కొండవీడు కోటను అభివృద్ధి చేయడంద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ఎనలేని మేలు కలుగుతుందని, టెంపుల్ టూరిజానికి మంచి కేంద్రబిందువు కాగలదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తెలియచేశారు. మంగళవారం సాయంత్రం ఆయన సచివాలయంలో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసి, నియోజకవర్గ మరియు కొండవీడుకోట అభివృద్ధిపై చర్చించారు. రూ.100 కోట్ల అంచనా వ్యయంతో కొండవీడు అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలను పొందుపరిచిన వినతిపత్రాన్ని ప్రత్తిపాటి, ముఖ్యమంత్రికి అందించారు. గతంలో కొండవీడు కోట అభివృద్ధిపై కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిసి తెలియచేసిన అంశాలను సీఎంకు వివరించిన ప్రత్తిపాటి.. పర్యాటకాభివృద్ధి కోసం కేంద్రం చేపట్టిన ఎస్.ఏ.ఎస్.సీ.ఐ, స్వదేశీ దర్శన్ పథకాల్లో కొండవీడు ప్రాజెక్ట్ ను చేర్చడంలో ప్రత్యేక చొరవచూపాలని ప్రత్తిపాటి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాజధాని అమరావతికి చేరువలోఉన్న ప్రముఖ ప్రాంతమైన కొండవీడు ఎకో టూరిజం అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలుస్తుందని చెప్పిన ప్రత్తిపాటి.. కోట ప్రాశస్త్యం.. వైభవం.. భౌగోళిక పరిస్థితులు.. అభివృద్ధి అవకాశాలను వివరిస్తూ రూపొందించిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందించారు.

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చి, కొండవీడును అసాంఘిక కార్యకలపాల అడ్డాగా మార్చిందని, దానివల్ల కోట ప్రాశస్త్యం,వైభవం మసకబారిందని ప్రత్తిపాటి ముఖ్యమంత్రికి తెలియచేశారు. టీడీపీ హాయాంలో వేసిన ఘాట్ రోడ్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదని, వైసీపీహాయాంలో మొక్కుబడిగా ప్రారంభించిన పనులన్నీ కంపచెట్లు, రాళ్ల పాలయ్యాయని చెప్పారు. నియోజకవర్గ సమస్యల్ని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని, ముఖ్యంగా రైతాంగానికి మేలు చేసే ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపునకు సరిపడా నిధులు కేటాయించి, నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం పెంపునకు సహకరించాలని ప్రత్తిపాటి సీఎంను కోరారు. నీటి లభ్యతతో నియోజకవర్గంలో ఉద్యాన పంటల సాగుపెరిగి, ఆదాయం సమకూరి రైతాంగానికి మేలు జరుగుతుందని. ఈ అంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తయిందని, రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే గృహ ప్రవేశాల వేడుక నాటికి సర్వహంగులతో నివాసాల్ని సిద్ధం చేస్తామని ప్రత్తిపాటి సీఎంకు తెలియచేశారు. కంపెనీల హామీతో గతేడాది నియోజకవర్గ రైతాంగం విరివిగా పొగాకు సాగు చేసిందని, ప్రభుత్వం చేపట్టిన కొనుగోళ్ల ప్రక్రియ వల్ల అందరికీ న్యాయం జరగలేదని, సమస్యను పరిశీలించి చిలకలూరిపేటసహా పొగాకు సాగు అయిన నియోజకవర్గ రైతాంగానికి న్యాయం చేయాలని ప్రత్తిపాటి ముఖ్యమంత్రిని కోరారు.

# సొలసలో అమానవీయ ఘటన.



**యడ్లపాడు అక్టోబర్ 21**

**లక్ష్యం న్యూస్**

మండల పరిధిలోని సొలస గ్రామములో తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించని కన్నబిడ్డలు. ఆస్తి పంపకాల నేపథ్యంలో కుమారులు, కుమార్తెల మధ్య వివాదం. మూడ్రోజుల క్రితం అనారోగ్యంతో గువ్వల ఆంజనేయులు (80) మరణించగా దహన సంస్కారాలకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు నిరాకరించారు. అంత్యక్రియలు చేయాలని పోలీసులు చెప్పినా మారని కన్నబిడ్డల వైఖరి, అనంతరం ఎస్ఐ టి శివరామకృష్ణ,మద్దూరి వీరారెడ్డి, గ్రామ పెద్దలు తో మాట్లాడి సమస్యను పరిష్కరించి చిన్న కుమారుడుతో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
బుధవారం ,22-10-2025

# యువ బీహార్ నిర్మాణనికై అఖండ మెజార్టీతో ఎల్జేపీ ని గెలిపించండి





ప్రచారంలో జొన్నలగడ్డ విజయ్ కుమార్

**– బీహార్ లో ఎన్నికలు... పల్నాడులో ఎన్నికల ప్రచారం.**

**– పాల్గొన్న లోక్ జనశక్తి పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్**

**సత్తెనపల్లి,అక్టోబర్ 21(లక్ష్యం న్యూస్ ):**

అబ్ కీ బార్ యువ బీహార్ అనే నినాదంతో లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ ) జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వన్ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని తమ పార్టీ ని ఆదరించి అఖండ మెజార్టీతో గెలిపించాలని పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ కోరారు. బీహార్ లో ఎన్నికలు సందర్భంగా పల్నాడులో పలు ప్రాంతాలతో పాటు సత్తెనపల్లిలో పనిచేస్తున్న బీహార్ వాసులను మంగళవారం ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పార్టీ తరుపున మొత్తం 29 మంది పోటీ చేస్తున్నామని మొదటి విడత నవంబర్ 6, రెండో విడత 11 జరిగే పోలింగ్ తేదీలో ఓటర్లు హెలికాప్టర్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీ తో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. లోక్ సభ ఎన్నికల సమయంలో ఐదు ఎంపీ స్థానాలకు పోటీ చేస్తే ఐదులి గెలిచారని అదేవిధంగా ఇప్పుడు 29 మంది శాసనసభకు పోటీ చేస్తున్నారని 29 మందిని గెలిపించాలని ఆయన కోరారు. రామ్ విలాస్ పాశ్వన్ కుమారుడు యువ నాయకుడైన చిరాగ్ పాశ్వన్ వలనే బీహార్ అభివృద్ధి వైపు పయనిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఒక్కొక్క ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు వేయాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళి వెంకట్రావ్, జొన్నలగడ్డ మాణిక్యరావు, సంజయ్ కుమార్, కొరబండి రాబర్ట్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా ఆదిపత్య ధోరణి నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రదర్శన



**యడ్లపాడు అక్టోబర్ 21 లక్ష్యం న్యూస్**

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిస్తూ ప్రధాని మోడీ లొంగుబాటుతనాన్ని నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించరు. గ్రామంలోని పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రం నుండి ప్రదర్శన మొదలై ప్రధాన వీధులలో ప్రదర్శన నిర్వహించి 16వ నెంబర్ జాతీయ రహదారి వంతెన వద్ద ధర్నా నిర్వహించారు. అమెరికా సుంకాలు విధించడం, ప్రభుత్వం మెతక వైఖరి నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రజలను ఉద్దేశించి సిపిఎం సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కారుచోల రోశయ్య, నూతలపాటి కాళిదాసు, బందెల పీటర్, జరుగుల శంకర్రావు, ఆర్ ఆంజనేయులు పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వరి పంట లో ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చు



వరి పంట వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది..

నకరికల్లు,అక్టోబర్ 21(లక్ష్యం న్యూస్): నరసింగపాడు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ రైతు రామ సుబ్బారెడ్డి వరి పంట వ్యవసాయ క్షేత్రాన్ని ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది సైదయ్య ,నందకుమార్, అప్పలరాజు సందర్శించడం జరిగింది.సైదయ్య మాట్లాడుతూ.. వరి పంటలో ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని పంట దిగుబడి పెరుగుతుందని తెలియజేయడం జరిగింది . రామ సుబ్బారెడ్డి వరి పంట వ్యవసాయ క్షేత్రంలో 1మీఐ1మీ లో కొన్ని రకాల పరిశీలనలు చేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సరాసరి దిబ్బుకి పిలకల సంఖ్య 25ఉండగా కంకులు వచ్చిన పిలకల సంఖ్య 23గాఉన్నవి వేరు వ్యవస్థ పొడవు 28%ఓఎ% ఉన్నది. దిబ్బు పొడవు ఒక మీటర్ గా ఉన్నది. అప్పలరాజు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ రైతులు వారి పంటలకు కావలసిన ఎరువులు( ఘనజీవామృతం, ద్రవ జీవామృతం) క్రిమిసంహారాలు( దశపరిని కషాయం, నిమాస్త్రం,పుల్లటిమజ్జిగ) వారి స్థాయిలో తయారు చేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలియజేయడం జరిగింది.రసాయన వ్యవసాయం చేస్తున్న రైతులు పొలాల్లో పరిశీలించగా దిబ్బుకి 18 పిలకలు వాటిలో 14మాత్రమే కంకులు వచ్చినవిగా ఉన్నవని, అంతే కాకుండా ప్రస్తుతం రైతులు ఎరువులు పురుగు మందులపై ఇప్పటికే 20వేల వరకు ఖర్చు చేయడం జరిగిందని తెలియజేసినారు.

కావున వరి పంట వేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా పెట్టుబడుల ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతుందని పంటకు చీడపీడల ఉధృతి తగ్గుతుందని అంతేకాకుండా పంటకు అధిక ధర లభిస్తుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి డివిజన్ మాస్టర్ ట్రైనర్ బాజీబాబు ,వెంకటేశ్వరరావు,సుబ్బారెడ్డి పాల్గొనడం జరిగింది..

# గుర్తుతెలియని వ్యక్తి మృతి



**పెదకాకాని, అక్టోబర్ 21 లక్ష్యం న్యూస్:**

మండల పరిధిలోని కల్వరి టెంపుల్ ఎదురుగా ఉన్న హైవే అండర్ పాస్ వద్ద ఒక గుర్తు తెలియని పురుషుడు, సుమారు 45 వయస్సు నుండి 50 సంవత్సరాల మధ్య ఉన్న వ్యక్తి గాయాలై పడిపోయి ఉండగా, అటుగా వెళ్ళే వ్యక్తులు గమనించి 108 అంబులెన్స్ ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కు తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. మృతుడు గుర్తు తెలియని వ్యక్తి అయినందున, ఎవరికైనా ఆ వ్యక్తి గురించి సమాచారం తెలిసినచో లేదా గుర్తు పట్టిన పట్టిన , ఈ క్రింది నెంబర్లకు పోలీస్ స్టేషన్ (ఫోన్: %జ× : 8688831350, ూ×% : 8688831352 ఫోన్ చేసి తెలపాలని సీఐ నారాయణస్వామి ప్రజలకు విజ్ఞప్తి చేసినారు.

# వైసీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా



డాక్టర్ భార్గవరెడ్డిని సత్కరిస్తున్న నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు ఈ.కే.

– లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏడుకొండలు..

– పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డా. సుధీర్ భార్గవరెడ్డికి చిరుసత్కారం..

సత్తెనపల్లి,అక్టోబర్ 21(లక్ష్యం న్యూస్): నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని, అంకితభావంతో పని చేస్తానని వైఎస్సార్సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన న్యాయవాది ఎమ్.ఏడుకొండలు అన్నారు. వైఎస్సార్సీపీ అధినేత, మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఇటీవల ఉత్తర్వులు వెలువడిన సందర్భంగా ఏడుకొండలు మంగళవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకం ఉంచి పార్టీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా తన వంతు పాత్ర పోషిస్తానని, లీగల్ సెల్ నుంచి అన్ని విధాలా నాయకులు, కార్య కర్తలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. తన నియామకానికి సహక రించిన న్యాయవాదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రత్యేక అభినందనలు తెలి పారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు, న్యాయవాదులు కాశిమాల మార్కు, గుంటూరు మాణిక్యరావు, తెనాలి నవజ్యోతిబాబు, బాదినేడి శ్రీనివాసరావు, రామాంజనేయులు, తదితరులు ఉన్నారు..

# రెండు లక్షల మందికి ఉద్యోగాలు

**విశాఖపట్టణం, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**



విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఒక గిగావాట్ డేటా సెంటర్‌ను విశాఖలో గూగుల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఐదేళ్లలో లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. అయితే గూగుల్ కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముడసర్లోవ, తర్లువాడ, రాంభిల్లి మండలంలోని భూములను గూగుల్ కోసం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ ప్రతినిధులు ఆ ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సుమారుగా లక్షా 33 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో ఇటీవల ఏపీ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు గూగుల్ సంస్థ విశాఖలో వేయి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం విశాఖలో స్థల పరిశీలన జరుగుతోంది. గూగుల్ సంస్థ ప్రతినిధులు విశాఖలో పర్యటిస్తున్నారు. అనువైన ప్రాంతం కోసం అన్వేషిస్తున్నారు. గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం తర్లువాడ, ముడసర్లోవ ప్రాంతాలతో పాటుగా అనకాపల్లిలో జిల్లాలోని రాంబిల్లి మండలంలోని భూములను కూడా కేటాయించనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ కన్సల్టెంట్లు.. ఏపీ ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించారు. గూగుల్‌కు కేటాయించిన భూములలో సర్వే చేపట్టి అనంతరం హద్దులను నిర్దేశించనున్నారు.గూగుల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములలో తొలుత తర్లువాడ వద్ద పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముడసర్లోవ వద్ద గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం కేటాయించే భూములు.. సింహాచలం ఆలయానికి చెందినవి. దీంతో దేవస్థానంతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రాంబిల్లిలోని భూములు నౌకాదళం కేంద్రానికి సమీపంలో ఉన్నాయి. దీంతో నౌకాదళం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న మీదట.. తర్లువాడ వద్ద భూములు సిద్ధంగా ఉండటంతో అక్కడే తొలుత పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలీస్ భద్రతను కూడా పెంచారు. త్వరలోనే సర్వే చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫెన్సింగ్ నాటే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న గూగుల్ సంస్థ.. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. గూగుల్ పెట్టుబడుల ద్వారా విశాఖపట్నం ఏఐ హబ్‌గా మారుతుందని ప్రభుత్వం చెప్తోంది. మరోవైపు అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావటం విశేషం. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి 2028–32 మధ్య కాలంలో ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని అంచనా.అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. మరోవైపు డేటా సెంటర్ వలన ఎక్కువగా ఉద్యోగాలు రావని వైసీపీతో పాటు మరికొందరి వాదన. కేవలం డేటా స్టోరేజీ కోసం మాత్రమే ఉపయోగిస్తారని.. దీనితో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు రావటం కష్టమంటున్నారు. అయితే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులతో మరిన్ని కంపెనీలు విశాఖకు వచ్చే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం చెప్తోంది.

## ఏపీ సీఫుడ్ పరిశ్రమ నెట్ వర్కింగ్ కు

# సహకారం అందించండి

– ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపుదలకు కలిసి పనిచేయండి

సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ

**ఆస్ట్రేలియా (సిడ్నీ):**

సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా (ూఎం) ప్రతినిధులు, ఆ సంస్థ సీఈవో వెరోనికా పాపకోస్టా, ఎస్ఐఏ ఎంగేజ్ మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్లేలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సిడ్నీ సమీపాన పారమట్టాలో భేటీ అయ్యారు. సీ ఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా (ూఎం) సీఈవో వెరోనికా పాపకోస్టా మాట్లాడుతూ... 2017 నుండి ప్రారంభమైన ూఎం లో ఆస్ట్రేలియాలోని వైల్డ్ క్యాచ్, ఆక్వాకల్చర్, సీఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన 30వేలకు పైగా వ్యాపారులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. తమ సంస్థ ప్రతి ఏటా ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థకు ౦జఆ 3.5 బిలియన్ విలువైన వాటాను అందిస్తోందని చెప్పారు. బయో సెక్యూరిటీ, ఎగుమతి పనితీరును మెరుగుపరచేందుకు ప్రభుత్వ, పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ భారత్ లో అగ్రగామిగా ఉంది. దేశం మొత్తమ్మీద ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో ఏపీ 60శాతానికి పైగా వాటా కలిగి ఉంది, 2024–25లో వి7.4 బిలియన్ డాలర్ల (రూ.66 వేలకోట్లు) విలువైన 16.98 మిలియన్ టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఏపీ నుంచి విదేశాలకు ఎగుమతి అయ్యాయి. ఆస్ట్రేలియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులతో ఆంధ్రప్రదేశ్ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులను అనుసంధానించేందుకు ట్రేడ్ మిషన్లు, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలను చేపట్టండి. భారత సముద్ర ఉత్పత్తుల మార్కెట్ విస్తరణ కోసం ఆంధ్రప్రదేశ్ ఆక్వా పరిశ్రమదారులు, ఆస్ట్రేలియా దిగుమతి దారుల మధ్య భాగస్వామ్యాలను సులభతరం చేయండి. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత, నిల్వ కాలాన్ని పెంచేందుకు ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ మేనేజ్ మెంట్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను పరిచయం చేయండి. పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తూ ఉత్పాదకతను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన ఆక్వా కల్చర్, మత్స్య సంపద నిర్వహణకు ఏపీ ఆక్వా పరిశ్రమదారులతో కలిసి నైపుణ్యాన్ని పంచుకోండి. ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ వంటకాలను ప్రోత్సహించి, కలినరీ టూరిజంను ఆకర్షించేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టండి. సముద్ర మట్టాల పెరుగుదల, తీవ్రమైన వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనేలా ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ పరిశ్రమలో నిరోధకశక్తిని పెంచే ప్రాజెక్టులపై కలిసి పనిచేయాలని మంత్రి లోకేష్ కోరారు.

# క్లౌడ్ స్టోరేజ్ సేఫ్టీ ఎంత

**హైదరాబాద్, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

నేటి డిజిటల్ యుగంలో, ప్రతి ఒక్కరికీ ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, యాప్ డేటా పుష్కలంగా ఉంటాయి. అయితే, ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లలో పరిమిత స్టోరేజ్ కారణంగా.. ప్రతిదీ ఒకే చోట నిల్వ చేయడం అసాధ్యం. క్లౌడ్ స్టోరేజ్ ఆధునిక, సురక్షితమైన పరిష్కారంగా ఉద్భవించింది. క్లౌడ్ స్టోరేజ్ అంటే మీ డిజిటల్ ఫైల్‌లను ఇంటర్నెట్ ద్వారా రిమోట్ సర్వర్‌లో నిల్వ చేయడం. దీని అర్థం మీ ఫోటోలు, వీడియోలు మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లో కాకుండా కంపెనీ డేటా సెంటర్‌లో నిల్వ చేయడం. ఈ డేటా సెంటర్ వేలకొద్దీ శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్‌లతో రూపొందించడం జరిగింది. ఇవి మీ డేటాను సురక్షితంగా ఉంచుతూ 24 గంటలూ పనిచేస్తాయి.మీరు గూగల్ డ్రైవ్, ఐక్లౌడ్, డ్రాప్ బాక్స్ వంటి క్లౌడ్ సేవను ఉపయోగించినప్పుడు, మీ ఫైల్ ఇంటర్నెట్ ద్వారా ఆ కంపెనీ సర్వర్‌లకు వెళుతుంది. అక్కడ, ఫైల్ చిన్న డేటా బ్లాక్‌లుగా విభజించబడి బహుళ సర్వర్‌లలో నిల్వ చేయడం జరుగుతుంది. ఒక సర్వర్ సాంకేతిక వైఫల్యాన్ని ఎదుర్కొంటే, మీ డేటాను మరొక సర్వర్ నుండి సులభంగా తిరిగి పొందగలిగేలా ఇది పని చేస్తుంది. దీనిని డేటా రిడెండెన్సీ అంటారు. తరువాత, మీరు అదే ఫైల్‌ను మళ్ళీ తెరిచినప్పుడు, సిస్టమ్ ఈ డేటా బ్లాక్‌లన్నింటినీ కలిపి మీకు పూర్తి ఫైల్‌ను చూపుతుంది. ఈ మొత్తం ప్రక్రియకు కొన్ని సెకన్లు పడుతుంది. మీ ఫైల్ అక్కడే ఉన్నట్లు, క్లౌడ్‌లో సురక్షితంగా ఉన్నట్లు మీకు అనిపిస్తుంది.క్లౌడ్ కంపెనీలు తమ సర్వర్లలో నిల్వ చేసిన డేటాను ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ఉపయోగించి రక్షిస్తాయి. దీని అర్థం మీ ఫైల్‌లు కోడెడ్ రూపంలో నిల్వ చేయడం జరుగుతుంది. వీటిని తెలియని వారు చదవలేరు. యాక్సెస్ చేయలేరు. లాగిన్ ఆధారాలు, యాక్సెస్ అనుమతులు ఉన్న వినియోగదారులు మాత్రమే ఫైల్‌లను తెరవగలరు. అదనంగా, కంపెనీలు బహుళ-పొర భద్రత, ఫైర్‌వాల్‌లు, సాధారణ బ్యాకప్ వ్యవస్థలను ఉపయోగించి డేటా హ్యాకింగ్ లేదా నష్టం నుండి రక్షించినట్లు నిర్ధారించుకుంటాయి.వేగవంతమైన, నమ్మదగిన సేవలను అందించడానికి క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో తమ డేటా సెంటర్లను నిర్మించారు. ఉదాహరణకు, గూగుల్ అమెరికా, సింగపూర్, ఐర్లాండ్, భారతదేశం వంటి దేశాలలో డేటా సెంటర్లను కలిగి ఉంది. అదేవిధంగా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ కూడా వారి స్వంత విస్తారమైన సర్వర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్నాయి. ఇవి 24 గంటలూ డేటాను నిల్వ చేసి నిర్వహిస్తాయి.క్లౌడ్ స్టోరేజ్ అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే మీరు మీ పరికరంలో డేటా స్టోరేజ్ ఖాళీ చేయవలసిన అవసరం లేదు. మీరు మీ ఫైల్‌లను ఎక్కడి నుండైనా యాక్సెస్ చేయవచ్చు. మీరు మీ ఫోన్‌ను పోగొట్టుకున్నా లేదా మీ ల్యాప్‌టాప్ క్రాష్ అయినా, మీ డేటా ఇంటర్నెట్‌లో సురక్షితంగా ఉంటుంది.

# రేవంత్, కొండా మధ్య కాంప్రమైజ్...

**హైదరాబాద్, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

ఇటీవల దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య వివాదం నెలకొంది. ఇది చినికి చినికి గాలి వాన లాగా మారింది. ఆ తర్వాత కొండ సురేఖ ప్రైవేట్ ఓఎస్డీ సుమంత్ పై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అతడిని తొలగించింది. అంతేకాదు ఓ సిమెంట్ ఫ్యాక్టరీ ఫిర్యాదు మేరకు కేసు కూడా నమోదయింది.సిమెంట్ కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు అతడిని అదుపులో తీసుకోవడానికి వెళ్లిన పోలీసులను సురేఖ కుమార్తె సుస్మిత ప్రతిఘటించింది. దీంతో పోలీసులు వెనక్కి వెళ్ళక తప్పలేదు. ఇదంతా కూడా మీడియాలో ప్రముఖంగా రావడంతో అధికార పార్టీపై విమర్శలు వ్యక్తం అయ్యాయి. దీనికి తోడు ఓ సిమెంట్ ఫ్యాక్టరీ విషయంలో ఓ వ్యక్తి తుపాకీ పట్టి బెదిరించాడని.. డబ్బుల వ్యవహారంలో పంచాయతీ వచ్చిందని సాక్షాత్తు మంత్రి కుమార్తె ఆరోపించడంతో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితికి ఇది ఒక ఆయుధం లాగా మారింది.మేడారం అభివృద్ధి పనుల విషయంలో ఓ మంత్రి అందులో వేలు పెట్టారని.. దేవదాయ శాఖ మంత్రి కి కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆరోపణలు వినిపించాయి. దీంతో అభివృద్ధి పనులపై జరుగుతున్న సమీక్షకు సురేఖ హాజరు కాలేదు. మంత్రివర్గ సమావేశానికి కూడా ఆమె దూరంగా ఉన్నారు. దీంతో ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారని ప్రచారం జరిగింది. దీనికి తోడు సురేఖ ఇంటి వద్ద పోలీసు భద్రతను తగ్గించడంతో పై ఆరోపణలకు మరింత బలం చేకూరింది. ఈ నేపథ్యంలోనే సుస్మిత, సురేఖతో భట్టి విక్రమార్క, మీనాక్షి నటరాజన్ చాలాసేపు మాట్లాడారు. ఆ తర్వాత ఒకరోజు గ్యాప్ తోనే కొండ మురళి, కొండ సురేఖ దంపతులు జూబ్లీహిల్స్ లో ముఖ్యమంత్రి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు అక్కడే ఉన్నారు.. సుస్మిత చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపిన నేపథ్యంలో.. కొండ దంపతులు ముఖ్యమంత్రిని కలవడం చర్చనీయాశంగా మారింది. మరోవైపు కొండ మురళి కూడా ఆ మధ్య విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి పై ఒక్క విమర్శ కూడా చేయలేదు. పైగా తనకు ఎమ్మెల్సీ ఇస్తారని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని.. ముఖ్యమంత్రి మీద తనకు ప్రగాఢమైన నమ్మకం ఉందని మురళి పేర్కొన్నారు. ఈ పరిణామాలు మొత్తం ఇటీవల కాలంలో తెలంగాణ రాజకీయాలలో సంచలనంగా మారాయి.జూబ్లీహిల్స్ ఎన్నికల ముందు ఇదంతా చేరడంతో ఒక రకంగా అధికార పార్టీ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నది. నష్ట నివారణ చర్యలలో భాగంగా పార్టీ నాయకత్వం రంగంలోకి దిగడంతో కొండా దంపతులు మెత్తబడినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రితో సంధికి ఓకే చెప్పినట్టు సమాచారం. ఫలితంగా దీపావళి రోజు ముఖ్యమంత్రి ఇంటికి వచ్చి మాట్లాడారని.. ఇక వివాదం ముగిసినట్టేనని తెలుస్తోంది.

# ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రభుత్వ బడి

**హైదరాబాద్, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల రాష్ట్రంలోనే తొలి ‘తెలంగాణ పబ్లిక్ స్కూల్’ (టీపీఎస్) గా రూపుదిద్దుకుంటోంది. నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన, సెమీ రెసిడెన్షియల్ సౌకర్యాలతో ఈ పాఠశాల అంతర్జాతీయ స్థాయిని తలపిస్తోంది. ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో ఇక్కడ చేరడం విశేషం.తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచాలనే ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల నిలుస్తోంది. రాష్ట్రంలోనే మొట్టమొదటి ‘ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ‘ (టీపీఎస్) గా రూపుదిద్దుకుంటున్న ఈ పాఠశాల నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే ప్రాంగణంలో పూర్తిస్థాయి ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తూ ఇంటర్నేషనల్ స్కూల్‌ను తలపిస్తోంది.ప్రతి మండలంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను టీపీఎస్‌లుగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా.. పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లాలో ఆరుట్ల, మంచాల పాఠశాలలను. నాగర్‌కర్నూల్ జిల్లాలో వంగూరు, పోల్కమ్‌పల్లి హైస్కూళ్లను ఎంపిక చేశారు. ఆరుట్ల పాఠశాల అభివృద్ధికి సోషల్ డెమోక్రటిక్ ఫోరమ్ (ఎస్‌డీఎఫ్) నుంచి దాదాపు రూ.3 కోట్లు విరాళంగా అందగా.. ఆ నిధులతో దాదాపు ఐదు ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు సెమీ రెసిడెన్షియల్ తరహాలో పనిచేస్తాయి. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. నర్సరీలో చేరిన విద్యార్థులు పదో తరగతి లేదా ఇంటర్ వరకు ఇక్కడే చదువుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఇతర గ్రామాల విద్యార్థుల కోసం బస్సులు, నాణ్యమైన విద్యతో పాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇస్తారు. సైన్స్, గణితం, ఆంగ్ల ల్యాబ్‌లు, అంతర్జాతీయ స్థాయి పాఠశాలల్లో ఉండే అన్ని సౌకర్యాలు ఇక్కడ కల్పిస్తున్నారు. ప్రీ ప్రైమరీ చిన్నారులకు ప్రత్యేక క్రీడా స్థలం ఏర్పాటు చేశారు.గత ఏడాది వరకు కేవలం 760 మంది విద్యార్థులు ఉన్న ఈ ప్రాంగణంలో.. టీపీఎస్ ప్రకటన ప్రభావంతో ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య దాదాపు 1,600కి పెరిగింది. కొత్తగా చేరిన వారిలో 80 శాతానికి పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి వచ్చిన వారే కావడం విశేషం. సుమారు 80 మంది ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు కూడా ఇక్కడే చేరారు. ప్రస్తుతం మూడు బస్సులు కొనుగోలు చేయగా.. మరికొన్ని సమకూర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.టీపీఎస్‌లను తీర్చిదిద్దే బాధ్యతను ప్రభుత్వం తెలంగాణ విద్యా కమిషన్‌కు అప్పగించగా.. కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆరుట్ల పాఠశాలకు రూ.9.86 కోట్లు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఉపాధి హామీ పథకం కింద కేవలం రూ.కోటి మాత్రమే విడుదలైంది. ప్రభుత్వం త్వరగా నిధులు విడుదల చేస్తే డైనింగ్ హాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తిచేయవచ్చని పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కోరుతున్నారు. మిగిలిన మూడు పైలట్ పాఠశాలల నిర్మాణానికి కూడా ఆర్కిటెక్ట్‌లు డిజైన్లు రూపొందిస్తున్నారు.

# ఆకట్టుకుంటున్న నవీన్ పోలిశెట్టి

## 'అనగనగా ఒక రాజు' దీపావళి ప్రత్యేక ప్రోమో




– సంక్రాంతికి వినోదాల విందుని హామీ ఇస్తున్న ప్రోమో
– త్వరలో 'అనగనగా ఒక రాజు' మొదటి గీతం విడుదల

తనదైన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి, మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి దీపావళి ప్రత్యేక ప్రోమో విడుదలైంది. నవ్వుల టపాసులను తలపిస్తున్న ఈ ప్రోమో, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2026 సంక్రాంతికి ప్రేక్షకులకు నవ్వులతో నిండిన అసలైన పండుగకు హామీ ఇచ్చేలా ఈ ప్రోమో ఉంది.నవీన్ యొక్క అద్భుతమైన హాస్య చతురత, అప్రయత్నమైన ఆకర్షణ ప్రతి ఫ్రేమ్ లో ప్రకాశించింది. తెరపై నవీన్ ఉత్సాహంగా కనిపించిన తీరు కట్టిపడేసింది. ఈ దీపావళి ప్రోమో వినోదాల విందులా ఉంది. నవీన్ పొలిశెట్టి శైలి హాస్యాన్ని ప్రేక్షకులు ఎందుకు అంతలా ఇష్టపడతారో ఈ ప్రోమో మరోసారి గుర్తుచేసింది.రెండు నిమిషాల ఇరవై ఎనిమిది సెకన్ల నిడివితో రూపొందిన ఈ దీపావళి ప్రోమో, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అతి కొద్దిమంది మాత్రమే నిమిషంలో ఇంతటి వినోదాన్ని పంచగలరు. అభిమానులు దీనిని "ఒక నవ్వుల అల్లరి", "వినోదాల విందు", "అసలైన పండుగ సినిమా" అని పిలుస్తున్నారు. హాస్యం, తాజాదనంతో నిండి, ప్రేక్షకులను మెప్పించే కథలను ఎంచుకోవడంలో నవీన్ మరోసారి తన నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు.ప్రేక్షకుల ఉత్సాహాన్ని మరింత పెంచుతూ.. ఈ భారీ అంచనాలున్న చిత్రం నుండి మొదటి గీతం త్వరలో విడుదల కానుంది.శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. నవీన్ పోలిశెట్టితో కలిసి ఆమె సరికొత్త వినోదాన్ని పంచనున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి, జె యువరాజ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న 'అనగనగా ఒక రాజు'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన దీపావళి ప్రోమో, ఆ అంచనాలను రెట్టింపు చేసింది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా 'అనగనగ ఒక రాజు' చిత్రాన్ని నిలిపింది.సరదాల పండుగ మొదలవుతుంది. దీపావళి ప్రోమో ఆకట్టుకుంది. మొదటి గీతం రాబోతుంది. 'అనగనగా ఒక రాజు' ఈ సంక్రాంతిని గుర్తుండిపోయేలా చేయడానికి సిద్ధమవుతోంది.చిత్రం: అనగనగా ఒక రాజుతారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

# పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం

**విజయవాడ, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం ఉందంటున్నారు. పవన్ కల్యాణ్ పదే పదే పదిహేనేళ్ల పాటు కూటమి కలసి ఉంటుందని చెబుతూ వస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ పెట్టే షరతులు కూడా మారతాయంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే పవన్ కల్యాణ్ గౌరవంగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను ఇబ్బందిపెట్టే విధంగా మాట్లాడినా మిత్రధర్మం కోసం పవన్ కల్యాణ్ సహిస్తూ కూటమి విచ్ఛిన్నం కాకపోవడానికి తానే కారణమని గట్టిగా చెప్పదలచుకున్నారు. ఇప్పటి వరకూ మిత్రపక్షాల్లో ఉన్న టీడీపీ నేతలు మాత్రమే జనసేన పై కొంత నోరు జారారుఅదేసమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం చాలా వరకూ సంయమనం పాటిస్తూ వస్తున్నారు. అందుకు దూరాలోచన కారణమన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. మొన్నటి ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించిన ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టగలిగారు. కీలకమైన పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ శాఖ వంటివాటిని ఏరికోరి తీసుకున్నారు. అంతేకాదు కొన్ని విషయాల్లో ప్రభుత్వ నిర్ణయాలను కూడా మంత్రి మండలి సమావేశాల్లో ప్రశ్నిస్తున్నారు. గతంలో అమరావతి రాజధాని రైతుల నుంచి అదనపు భూముల విషయంలో అభ్యంతరాలు తెలపడంతో పాటు ఇటీవల లూలూ సంస్థ పెట్టిన షరతులను కూడా ప్రశ్నించి తాను అవసరమైనప్పుడు ప్రశ్నిస్తానని సిగ్నల్స్ అధికార టీడీపీకి ఇవ్వగలిగారు.మరోవైపు 2024 ఎన్నికల వరకూ ఆయన ఎమ్మెల్యేగా కూడా ఎన్నిక కాలేదు. దీంతో అనుభవం లేకపోవడంతో సీట్ల పంపకంలో గాని, చివరకు మంత్రి పదవుల విషయంలోగాని ఒకింత రాజీ పడ్డారు. తాను తక్కువ సంఖ్యలో సీట్లు తీసుకున్నానని ఆయనకు తెలుసు. జనసైనికులకే కాదు తన అభిమానులకు కూడా అది నచ్చదని తెలిసినా చంద్రబాబు అనుభవానికి పెద్దపీట



వేయాలని సహకరించారు. ఇకపై అలా ఉండదంటున్నారు. ఎందుకంటే ఉప ముఖ్యమంత్రిగా ఎటూ వచ్చే ఎన్నికల నాటికి ఐదేళ్ల అనుభవం ఉంటుంది. అందుకే వచ్చే ఎన్నికల్లో షరతులు ఉంటాయన్నది జనసైనికుల నుంచి వినిపిస్తున్నమాట. అలాగే సీట్ల విషయంలోనూ రాజీ ఉండదన్న అభిప్రాయం పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతుంది. తనకు కూటమి కలసి ఉండటం ఎంత అవసరమో టీడీపీకి అంతకంటే ఎక్కువ అవసరం కావడంతో ఈరోజు షరతులు వర్తిస్తాయని జనసైనికులు బాహాటంగానే చెబుతున్నారు.

# స్టేట్స్ లో ట్వీట్స్ వార్...

**విశాఖపట్టణం, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

స్టేట్స్ అండ్ ట్వీట్స్ వార్ నడుస్తూనే ఉంది. ఏపీ, కర్ణాటక మినిస్టర్స్ మధ్య ఇన్వెస్ట్‌మెంట్స్‌పే డైలాగ్ వార్ కొనసాగుతోంది. బెంగళూరులో రోడ్లు బాలేవు..సౌకర్యాలు కల్పించడం లేదని కంపెనీల సీఈవోలు పెట్టిన పోస్టులతో వివాదం మొదలై..లోకేశ్ రెస్పాండ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ చేసిన ట్వీట్‌కు లోకేశ్ అదే స్థాయిలో రియాక్ట్ కావడం ఆసక్తికరంగా మారింది. కర్ణాటక మంత్రులు?ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. బెంగళూరులో పరిశ్రమలను రన్ చేయలేకపోతున్నామని..అక్కడి నుంచి వెళ్లిపోతామంటూ పలువురు ఇండస్ట్రియలిస్టులు స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఆ మధ్య చర్చకు దారితీసింది. ఇదే అదునుగా..ఏపీకి వచ్చేయండి..మీకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ అంటూ లోకేశ్ చేసిన ట్వీట్స్ ఆసక్తికరంగా మారాయి. బెంగళూరులో రోడ్లు, ఇతర సౌకర్యాలు, వసతులపై ఏరో స్పేస్ పార్క్, బ్లాక్ బక్ అనే పరిశ్రమ అసంతృప్తిపై గతంలోనే లోకేశ్ రియాక్ట్ అయ్యారు.ఏరో స్పేస్ పార్క్‌ను అనంతపురంకు..బ్లాక్ బక్ పరిశ్రమలను విశాఖపట్నానికి తరలించాలని కోరారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో కాక రేగింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే పరిశ్రమలు ఏపీకి తరలిపోతున్నాయని అక్కడి విపక్షాలు సిద్దరామయ్య సర్కార్‌పై అటాక్ స్టార్ట్ చేయడంతో..15 రోజుల క్రితం పెద్ద రచ్చే అయింది. అప్పటినుంచే ఏపీ, కర్ణాటక మంత్రుల మధ్య ట్వీట్ వార్ మొదలై..ఈ మధ్య కాస్త చల్లబడిందిఇప్పుడు గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ ప్రియాంక్ ఖర్గే చేసిన కామెంట్స్ చర్చకు దారి తీస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం అడ్డగోలుగా రాయితీలు ఇచ్చి గూగుల్ డేటా సెంటర్‌ను ఏపీకి తెచ్చుకుందన్నారాయన. అన్ని రాయితీలు ఇస్తే ఏ రాష్ట్రం అయినా పెట్టుబడులు తెచ్చుకోవచ్చన్నారు. అంతేకాదు ఏపీ అప్పులు ఇప్పుడు దాదాపు రూ.10 లక్షల కోట్లకు పెరిగాయని, కేవలం ఒక సంవత్సరంలోనే రూ.లక్షా 61 వేల కోట్లకుపైగా అప్పులు తీసుకున్నారని కూడా ప్రియాంక్ ఖర్గే ట్వీట్ చేశారు.ఆంధ్రా ఫుడ్ స్పైసీగా ఉంటుందని..ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో కాస్తంత ఘాటు ఉన్నా.. దాన్ని ఆస్వాదిస్తారు. కానీ పోషకాహార నిపుణులు ఆహారంలో సమతుల్యత ఉండాలని సిఫార్సు చేస్తున్నారు. అలాగే ఆర్థికవేత్తలు కూడా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్‌ను మెయింటేన్ చేయాలని చెబుతున్నారంటూ ప్రియాంక్ ఖర్గే తన ట్వీట్‌లో చెప్పుకొచ్చారు. ఏపీ ఐటీ మంత్రి లోకేశ్..ప్రియాంక్ ఖర్గేకు కౌంటర్ ఇచ్చారు. ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడంపై పొరుగు రాష్ట్రాల్లో అలజడి మొదలైందన్నారు. ఆంధ్రా ఆహారం కారంగా ఉంటుందని అంటున్నారని, తమ పెట్టుబడులు కూడా అలాగే అనిపిస్తున్నాయని చురకలు అంటించారు. పొరుగువారికి ఇప్పటికే ఆంధ్రా కారం ఘాటు సెగ తగులుతుందని లోకేశ్ ఇచ్చి పడేశారు.ఈ ట్వీట్ వార్ లో ఏపీ ఐటీ మినిస్టర్ చుట్టూ చర్చ జరుగుతోంది. ఏపీకి ఇన్వెస్ట్‌మెంట్స్ తేవడంలో లోకేశ్ కీరోల్ ప్లే చేస్తున్నట్లుగా ఆయనకు హైప్ క్రియేట్ అవుతోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇద్దరిలో ఎవరూ కూడా కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌పై రియాక్ట్ కావడం లేదు. ప్రియాంక్ ఖర్గే అయినా..డీకే శివకుమార్ వ్యాఖ్యలు చేసినా..లోకేశే వారికి కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ ఐటీ మినిస్టర్‌గా లోకేశ్ పెట్టుబడులు తెస్తుంటే..కర్ణాటక మంత్రులు అడ్డుకుంటున్నారని ..జనాల్లో చర్చ జరుగుతోంది.గూగుల్ డేటా సెంటర్ అగ్రిమెంట్ నుంచి..ఇటు ఏపీలో విపక్ష వైసీపీ విమర్శల దాక..అటు కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌తో లోకేశ్ సెంట్రిక్‌గా డిస్కషన్ నడుస్తోంది. అటు ఐటీ ఫీల్డ్‌లోనూ..ఇటు ఏపీ పబ్లిక్‌లోనూ..నేషనల్ మీడియాలోనూ లోకేశ్ ట్వీట్స్‌పై డిస్కషన్ నడుస్తోంది. గూగుల్ డేటా సెంటర్ రాక సందర్భంగా ఎంతగా ప్రచారం చేసుకోవాలో అంతకంటే ఎక్కువే మైలేజ్ పొందే ప్రయత్నం చేస్తోంది కూటమి. పైగా బెంగళూరులో రోడ్లు, సౌకర్యాలు, వసతుల సరిగ్గా లేవని కంపెనీల సీఈవోలు చేస్తున్న ట్వీట్లను లోకేశ్ ప్లస్ పాయింట్‌గా మార్చుకోవడంతో..ఓవరాల్ ఎపిసోడ్‌లో ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ హైలెట్ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. కర్ణాటక మంత్రులు, ఏపీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్‌కు ఎండ్ కార్డ్ పడేదెప్పుడో చూడాలి.

## హైదరాబాద్‌లో మారుతున్న ఐటీ స్వరూపం

**హైదరాబాద్, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

:హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో స్వర్ణయుగం ముగిసి, ఒత్తిడి పెరిగింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కృత్రిమ మేధస్సు రాకతో ఉద్యోగాల తొలగింపులు, కొత్త నియామకాల లేమి ఏర్పడ్డాయి. టీసీఎస్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఖర్చులను తగ్గించుకో వడానికి.. ఏఐ లో పెట్టుబడులు పెంచడానికి ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ పరిస్థితిలో నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకోనిదే ఉద్యోగ భద్రత కష్టమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.కొన్ని సంవత్సరాల క్రితం వరకు.. హైదరా బాద్ నగరంలోని ఐటీ ఉద్యోగుల జీవితం ఒక సుస్థిర స్వర్ణ యుగంలా ఉండేది. వారానికి ఐదు రోజులు మాత్రమే పని.. భారీ వేతనాలు.. తరచూ బోనస్‌లు, వేతన పెరుగుదల వంటి అద్భుత అవకాశాలు ఉండేవి. కంపెనీలు మారితే చాలు, జీతాలు ఆకాశాన్ని తాకేవి. వివాహ సంబంధాల కోసం ఐటీ ఉద్యోగుల వెనుక క్యూ కట్టేవారు. కానీ.. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా తలకిందులైంది.మారుతున్న ఆర్థిక పరిస్థితులు , సాంకేతిక సేవలకు తగ్గిన గిరాకీ కారణంగా, హైదరాబాద్ ఐటీ పరిశ్రమ కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగాల తొలగింపులు, కొత్త నియామకాల లేమి వంటి సవాళ్లు ఉద్యోగులలో భయాన్ని పెంచుతున్నాయి. కోర్ ఇంజనీరింగ్ విభాగాలలో డిమాండ్ తగ్గడంతో.. బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో సాఫ్ట్‌వేర్ రంగం వైపు మళ్లుతున్నారు. నైపుణ్యాలు లేకపోయినా, కోర్సులు చదివే వారి సంఖ్య పెరుగుతున్నా.. అందుకు తగ్గ ఉద్యోగాలు మార్కెట్‌లో లేకపోవడంతో హైదరాబాద్‌లో నిరుద్యోగం పెరిగి, యువతలో నిరాశ ఆవహిస్తోంది.సాంప్రదాయకంగా హైదరాబాద్ స్థిరమైన ఉద్యోగాలకు కేంద్రంగా ఉండేది. కానీ.. ప్రస్తుత అనిశ్చిత వాతావరణం ఉద్యోగుల భద్రతను ప్రశ్నిస్తుందనే చెప్పాలి. ఎంతో మంది బిక్కుబిక్కుబంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తుకు పెద్ద సవాలుగా కృత్రిమ మేధస్సు మారుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఏఐ రాకతో, మానవ శ్రమతో చేసే పనులు ఆటోమేషన్‌కు గురవుతున్నాయి. దీనివల్ల నైపుణ్యం లేనివారు.. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తమను తాము అప్ డేట్ చేసుకోని ఎంతటి అనుభవం ఉన్న ఉద్యోగి అయినా ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోంది.దేశంలోని అతిపెద్ద సాంకేతిక సంస్థల్లో ఒకటైన టీసీఎస్ సైతం, ఆటోమేషన్ యుగానికి మారలేని ఉద్యోగులను వెనక్కి పంపిస్తోంది. ప్రపంచ దిగ్గజ సంస్థలు అయిన గూగుల్ వంటివి కూడా ఖర్చులు తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగించడం అనేది, తమ పెట్టుబడులను కృత్రిమ మేధస్సు వంటి అత్యంత కీలకంగా భావించే రంగాలకు తరలించడానికి చేపట్టిన వ్యూహాత్మక పునర్నిర్మాణంగా చెప్పుకోవచ్చు. డేటా విశ్లేషణ, పాత ప్లాట్‌ఫామ్ డిజైన్ వంటి సాంప్రదాయ ఉద్యోగాలు వేగంగా ఆటోమేషన్ అవుతున్నాయి. కాబట్టి.. ప్రస్తుతం ఉద్యోగులు నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన ఆవశ్యకత చాలా ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు.

# యాక్టివ్ అయిన కేడర్



**విజయవాడ, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

వైసీపీ అధినేత జగన్ పార్టీకి కేవలం పదహారు నెలల్లోనూ ఆంధ్రప్రదేశ్ లో కొంత ఊపు కనిపిస్తుందని ఆ పార్టీ నేతలు అంచనా వేసుకుంటున్నారు. అందుకే ఇన్నాళ్లూ బయటకు రాని వారు కూడా ఇప్పుడు వైసీపీకి వచ్చే క్రేజ్ ను చూసి తిరిగి యాక్టివ్ అవుతున్నారు. ఇప్పటి వరకూ వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారం వస్తుందో రాదో అన్న అనుమానంతో ఇంటి గడప దాటని నేతలు కూడా నేడు బయటకు వచ్చి అధికార పార్టీ పై విమర్శలు చేస్తున్నారు. జనం నాడి కొంత తెలియడంతో వారి మనసులు కూడా మారాయంటున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన పదిహేను నెలల నుంచి కనిపించని నేతలు నేడు బయటకు రావడంతో పాటు వైసీపీ ఇచ్చిన కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నారు.అదే సమయంలో మీడియా సమావేశాలు కూడా పెట్టి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ గుడివాడ అమర్ నాథ్, పేర్ని నాని, జోగి రమేష్, ఆర్కే రోజా, విడదల రజనీ, బొత్స సత్యనారాయణ వంటి నేతలు మాత్రమే మీడియాలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి ముందుండే వారు. కానీ దూరంగా ఉండే ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు కూడా బయటకు వస్తున్నారంటే పార్టీకి కొంత హైప్ కనపడుతుందన్న భావన నేతల్లో వ్యక్తమవుతుంది. కేవలం పదహారు నెలల్లోనే వైసీపీ నేతలు ఇంత యాక్టివ్ అయితే రానున్న కాలంలో మరింతగా బయటకు వచ్చి ప్రజల్లోకి వెళతారన్న అంచనాలో కేంద్ర పార్టీ కార్యాలయం కూడా ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా జగన్ పర్యటనలకు జనం నుంచి మంచి స్పందన రావడంతో పాటు క్యాడర్ కూడా భయం లేకుండా వచ్చి పాల్గొనడంతో ఈ మార్పునకు కారణమని అంటున్నారు. అనేక అంశాలు వైసీపీకి ప్లస్ గా మారాయన్న లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధానంగా గుంటూరు మిర్చి రైతులు, పొదిలి పొగాకు రైతులు, బంగారుపాళ్యంలో చిత్తూరు మామిడి రైతుల కోసం వెళ్లిన పర్యటనతో పాటు పల్నాడు పర్యటన, తాజాగా ఉత్తరాంధ్ర పర్యటన కూడా సక్సెస్ కావడంతో ఒక్కొక్కరుగా నేతలు బయటకు వస్తున్నారు. దీంతో పాటు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశంతో పాటు కల్తీ మద్యం ఘటన కూడా తమకు అనుకూలంగా మారుతుందని అంచనా వేసుకుని మరీ నేతలు బయటకు వస్తున్నారని వైసీపీ కీలక నేత ఒకరు చెప్పారు. మొత్తం మీద రానున్న రోజుల్లో వైసీపీ నేతలు ఇక జనం బాట పట్టే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఎమ్మెల్యేను బెదిరించి కోటి రూపాయలు

**గుంటూరు, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

దేశవ్యాప్తంగా రోజురోజుకూ డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోతున్నాయి. సామాన్యులనే కాదు.. ప్రజాప్రతినిధులను కూడా కేటుగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా.. ఏపీలోని ఓ ఎమ్మెల్యేను బెదిరించి అతని నుంచి కేటుగాళ్లు కోటి రూపాయలు కొట్టేశారు. అసలు విషయం తెలుసుకున్న సదరు ఎమ్మెల్యే.. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకిదిగి విచారణ చేస్తున్నారు.ఏపీకి చెందిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని నివాసంలో ఉండగా.. ఈ నెల 10వ తేదీన ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారి గౌరవ్ శుక్లాగా పరిచయం చేసుకున్నాడు. ఎమ్మెల్యే బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించాడు. ఆ తరువాత కొద్దిసేపటికి మరో నెంబర్ నుంచి వీడియో కాల్ వచ్చింది. యూనిఫాంలో ఉన్న ఆ వ్యక్తి ముంబై సైబర్ క్రైమ్ బ్రాంచ్ అధికారి విక్రమ్‌గా పరిచయం చేసుకున్నాడు.ఉగ్రవాదుల బ్యాంకు లావాదేవీల కేసులో మీకు ప్రమేయం ఉంది.. మనీ లాండరింగ్ జరిగిందని పేర్కొంటూ.. ఒక ఉగ్రవాది ఖాతా నుంచి రూ.3కోట్లు మీ బ్యాంక్ ఖాతాకు బదిలీ అయ్యాయంటూ నకిలీ పత్రాలు, అరెస్టు వారెంట్లు చూపించి బెదిరించాడు. అంతేకాదు.. మీ బ్యాంక్ అకౌంట్లు పరిశీలించాలి.. అందుకు సహకరించాలి.. ఏ క్షణమైనా అరెస్టు చేస్తామంటూ భయపెట్టాడు. ఈ క్రమంలో పలు దఫాలుగా ఎమ్మెల్యే నుంచి రూ.1.07కోట్లు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు.మళ్లీ కొద్దిగంటల తరువాత మరో రూ.60లక్షలు ఇవ్వాలి అంటూ డిమాండ్ చేశాడు. దీంతో మోసపోయినట్లుగా గుర్తించిన ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్.. వెంటనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ లో జరిగిన విషయాన్ని వివరించి ఫిర్యాదు చేశారు.రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు విచారణ చేస్తున్నారు. హరియాణా, ఉత్తరప్రదేశ్ సైబర్ గ్యాంగ్ చేతివాటంగా పోలీసులు గుర్తించారు. సైబర్ కేటుగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

# దీపావళి వెలుగుల వెనుక చీకట్లు

**హైదరాబాద్, అక్టోబరు 21, (లక్ష్యం న్యూస్)**

దీపావళి పండుగ సందర్భంగా టపాసుల వల్ల జరిగిన ప్రమాదాలు హైదరాబాద్ నగరంలో విషాదాన్ని నింపాయి. పండుగ రోజున చిన్నా పెద్దా తేడా లేకుండా ఆనందంగా క్రాకర్స్ కాల్చినా.. వాటి నుంచి వెలువడిన నిప్పు రవ్వలు, పేలుడు శకలాలు తగిలి చాలా మంది కంటి చూపు ప్రమాదంలో పడింది. దీని కారణంగా నగరంలోని ప్రముఖ సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి బాధితులు భారీగా క్యూ కట్టారు.దీపావళి రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఒక్క సరోజినీ కంటి ఆసుపత్రిలోనే దాదాపు 47 మంది బాధితులు చికిత్స కోసం చేరారు. ఈ దురదృష్టకర ఘటనల్లో గాయపడిన వారిలో 18 మంది చిన్నారులు ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఆసుపత్రిలో చేరిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని.. వారికి చూపు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. నగరంలో పలుచోట్ల టపాసులు చేతిలోనే పేలడం, కళ్లలో ముక్కలు పడడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.ప్రస్తుత బాధితులకు తగిన చికిత్స అందిస్తున్నామని, ప్రతి సంవత్సరం ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్న నేపథ్యంలో అదనంగా ఎన్ని కేసులు వచ్చినా చికిత్స అందించడానికి పూర్తి సన్నాహాలు చేశామని డాక్టర్లు వెల్లడించారు. సరోజినీ ఆసుపత్రి కాకుండా.. గాయపడిన మరికొందరు బాధితులు చికిత్స కోసం నగరంలోని పలు ప్రైవేటు కంటి ఆసుపత్రులను కూడా ఆశ్రయిస్తున్నారు.టపాసుల కారణంగా జరిగే గాయాల్లో కంటి చూపు కోల్పోవడం అత్యంత ప్రమాదకరమైన అంశం కాబట్టి ప్రజలు బాణసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, రక్షణ కళ్ళద్దాలు ధరించడం, టపాసులు కాల్చేటప్పుడు పిల్లలను పెద్దల పర్యవేక్షణలో మాత్రమే ఉంచడం వంటి నివారణ చర్యలు పాటించాలని వారు విజ్ఞప్తి చేశారు. క్రాకర్స్ పేల్చే సమయంలో నీటికి కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాసం ఉంటుందని చెబుతున్నారు. అజాగ్రత్త కారణంగా ఆనందాన్ని పంచుకోవాల్సిన పండుగ రోజున ఇటువంటి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు.

# స్క్రాప్ గోదాం లో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ (లక్ష్యం న్యూస్)**

పాతబస్తీ బహదూర్ పురా చౌరస్తా వద్ద ఓ స్క్రాప్ గోదాం లో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న బహదూర్పుర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజెన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోపే గోదాం లోని స్క్రాప్ సామగ్రి పూర్తిగా దగ్ధమయింది. ఓ జీపు, ఓ కారు పూర్తిగా బూడిద అయ్యాయి. ఈ ఘటనలో కామాటిపుర పోలీసులు, బహదూర్పుర పోలీసులు, డిఆర్ఎఫ్ బృందాలు మరియు అగ్నిమాపక దళ సిబ్బంది పాల్గొన్నారు. కామాటిపుర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO